సమస్యలపై అక్షర యుద్ధం

- నందమూరి నగర్‌లో సమస్యలపై సదస్సు
- 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' ఆంధ్రజ్యోతి ఆధ్వర్యంలో నిర్వహణ
- హాజరు కానున్న మంత్రి ఫరూక్, కమిషనర్ నిరంజన్ రెడ్డి



నంద్యాల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నంద్యాల మున్సిపాలిటీ శరవేగంగా విస్తరిస్తున్నప్పటికీ చాలా కాలనీల్లో సమస్యలు ఎక్కడికక్కడే తిష్ట వేశాయి. అధ్వానంగా రోడ్లు, పారుదల లేని మురుగు, కనీస వసతులు కరువైన పార్కు, వెలగని వీధి దీపాలతో ఆయా కాలనీ వాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. కాలనీలో నేటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. వీటిపై ప్రయాణం నరకంగా మారింది. దోమల నివారణ చర్యలు లేకపోవడం వల్ల దోమల బెడద, కుక్కల స్వైర విహారం వంటి సమస్యలతో ప్రజలు ఆందోళన చెందుతున్నారు. వీటితో పాటు మరిన్ని సమస్యలను అధికారుల దృష్టికి తెచ్చేందుకు 'ఆంధ్రజ్యోతి' ఓ బృహత్తర కార్యక్రమానికి సంకల్పించింది. మంగళవారం నంద్యాల మున్సిపల్ పరిధి. 37,38 వార్డు నందమూరినగర్‌లో 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..' ఆంధ్రజ్యోతి పరిష్కార వేదిక సదస్సు నిర్వహించనుంది. ఈ సదస్సు నందమూరి నగర్‌లోని పార్క్ వద్ద సాయంత్రం 3:00 నుంచి 5:30 గంటల వరకు జరుగుతుంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మైనార్టీ శాఖ మంత్రి ఎన్‌ఎండీ ఫరూక్, మున్సిపల్ కమిషనర్ నిరంజన్ రెడ్డి, ఇతర అధికారులు హాజరవుతారు. ప్రజల నుంచి సమస్యలు తెలుసుకుని ప్రజాప్రతినిధులు, అధికారుల దృష్టికి తీసుకొచ్చి పరిష్కరించడమే ఈ సదస్సు ముఖ్య లక్ష్యం.

మద్యం దుకాణాలకు దరఖాస్తుల ఆహ్వానం


రవికుమార్

నంద్యాల క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల జిల్లాలో 11 మద్యం దుకాణాలను ఈడిగ, గౌడ, గౌడ్ కులస్తులకు ప్రభుత్వం కేటాయించిందని, ఆయా కులాల వారు దరఖాస్తు చేసుకోవాలని ఎక్సైజ్ సూపరింటెండెంట్ రవికుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ జిల్లాలోని 11మద్యం దుకాణాలకు ఆయా కులాల వారు సోమవారం నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆన్‌లైన్‌లో, ఎక్సైజ్ స్టేషన్లలో దరఖాస్తు చేసుకోవాలన్నారు. కులధృవీకరణ పత్రాలను తహసీల్దార్ కార్యాలయాల నుంచి తప్పనిసరిగా తీసుకోవాలని పేర్కొన్నారు. దరఖాస్తుతో పాటు రూ.2లక్షల నాన్ రిఫండబుల్ చలానా జత చేయాలని సూచించారు. ఫిబ్రవరి 7వ తేదీన లక్కీడిప్ ఉంటుందని పేర్కొన్నారు. కార్యక్రమంలో ఏఈఎస్ రాముడు, సీఐ కృష్ణమూర్తి పాల్గొన్నారు.

మద్యం.. చోద్యం..!





ఆత్మకూరు ప్రాంతంలో కొంతమంది మద్యం దుకాణదారులు బరితెగించారు. రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు. మద్యం దుకాణాలు ఏర్పాటు మొదలుకొని నేటి వరకు నిబంధనలకు పాతరేసి దర్జాగా తమ దందా సాగిస్తున్నారు. అరికట్టాల్సిన ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్, పోలీసు అధికారులు రాజకీయ నాయకుల గుప్పిట్లో పావులుగా మారారన్న విమర్శలు ఉన్నాయి. ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మొత్తం 13 మద్యం దుకాణాలు ఉన్నాయి. ఇందులో ఆత్మకూరు అర్బన్, రూరల్ పరిధిలో 6, వెలుగోడు 3, సున్నిపెంటలో 2, కొత్తపల్లి 1, పాములపాడు 1 చొప్పున దుకాణాలు ఉన్నాయి. అయితే వీటిలో కొన్ని దుకాణాలు నిబంధనలకు విరుద్ధంగా నడుస్తున్నట్లు ప్రచారం జరుగుతోంది. ఈ వ్యవహారం కూటమి ప్రభుత్వ పాలనకే మాయని మచ్చలా ఉందన్న అభిప్రాయాలు వినిపిస్తున్నాయి.

ఆత్మకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి)

- దుకాణాల పక్కనే మద్యపానం
- రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యం
- నాయకుల గుప్పిట్లో ఎక్సైజ్ అధికారులు..?
- ఉదాసీనంగా వ్యవహరిస్తున్న పోలీసులు
- గ్రామాల్లో జోరుగా 'బెల్ట్' అమ్మకాలు

రాజకీయ అండదండలతో ఇష్టారాజ్యం



ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో దుకాణాలు దక్కించుకున్న వారిలో కొంత మందికి రాజకీయ అండదండలు పుష్కలంగా ఉన్నట్లు తెలుస్తోంది. ఇదే అదునుగా తమను అడిగేదెవరు అన్నట్లు వ్యవహరిస్తున్నట్లు తెలుస్తోంది. ప్రస్తుతం మద్యం దుకాణాలకు అనుబంధంగా ప్రభుత్వం పర్మిట్ రూమ్‌లకు అనుమతి ఇవ్వలేదు. అయితే మద్యం దుకాణాల పక్కనే కూల్‌డ్రింక్ షాపుల పేరుతో గదులను లీజుకు తీసుకొని మద్యం సేవించడాన్ని ప్రోత్సహిస్తున్నారు. ఓ దుకాణం వద్ద ఏకంగా భారీ కాంప్లెక్స్ కేటాయించి మరీ మద్యాన్ని తాపిస్తున్నారు. అంతేకాకుండా నిర్దిష్టమైన సమయవేళలు పాటించకుండా స్టాక్ లోడింగ్ పేరుతో అర్ధరాత్రి వరకు కొన్ని దుకాణాలు తెరిచి అమ్మకాలు సాగిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. దీనివల్ల మద్యపానం చేసేందుకు అనుమతులు ఉన్న బార్‌అండ్ రెస్టారెంట్‌లు నష్టపోవాల్సి వస్తోంది. ఈ విషయం ఎక్సైజ్ అధికారులకు తెలిసినా చోద్యం చూస్తున్నట్లు విమర్శలు ఉన్నాయి.

మాట వినకుంటే చిక్కులే..

నిబంధనల ప్రకారం లాటరీ పద్ధతిలో మద్యం దుకాణాలను దక్కించుకున్న వారు స్థానిక రాజకీయ నాయకుల మాట వినకంటే చిక్కులు తప్పడం లేదు. వింటే సరీ.. వినకపోతే తమ దారికి తెచ్చుకునేందుకు పోలీసు, ఎక్సైజ్ అధికారులనే పావుగా వాడుకుంటున్నారన్న విమర్శలు ఉన్నాయి. ప్రత్యేకించి కొత్తపల్లి, పాములపాడు మద్యం దుకాణాలకు సంబంధించి నేటికీ రాజకీయ నాయకులచే ఒప్పందం కుదరలేదని తెలుస్తోంది. దీంతో ఆయా దుకాణదారులకు సదరు నేతలు తమ పలుకుబడి ఏమిటో చూపిస్తున్నారన్న విమర్శలు ఉన్నాయి. అధికార యంత్రాంగాన్ని ఉపయోగించుకొని చిన్న వాటికే కేసులు నమోదు చేయిస్తున్నట్లు సమాచారం. ఆయా దుకాణాల వారు ఏ చిన్న తప్పు చేసినా వదలకూడదని కన్నేసి ఉంచుతున్నారు. అంతేకాదు ఆ రెండు దుకాణదారులను ఆర్థికంగా దెబ్బతీసేందుకు ఆయా మండలాల్లోని అన్ని గ్రామాల్లోని బెల్ట్ దుకాణాలకు నందికొట్కూరు నుంచి ప్రతిరోజూ మద్యం సరఫరా చేస్తున్నట్టు సమాచారం. ఈ విషయం ఎక్సైజ్, పోలీసు అధికారులకు తెలిసినా మిన్నకుండినట్లు తెలిసింది. ఈ క్రమంలోనే ఈ నెల 26వ తేదీన కొత్తపల్లి మండలంలోని శివపురం గ్రామంలో ముగ్గురు వ్యక్తుల నుంచి 63 క్వార్టర్ సీసాలను ఎక్సైజ్ అధికారులు స్వాధీనం చేసుకున్నట్లు తెలిసింది. అయితే ఆ ముగ్గురు వ్యక్తులు అధికార పార్టీకి చెందిన ఓ కీలక నేత ప్రోత్సాహంతోనే బెల్టు షాపులను నిర్వహిస్తున్నట్లు సమాచారం. దీంతో కేసును నీరుగార్చి ఆ ముగ్గురిని తప్పించే ప్రయత్నాలు జరుగుతున్నాయి. ఇదిలావుంటే వెలుగోడు, సున్నిపెంటలో రాజకీయ నేతల ఒప్పందాల మేరకే మద్యం షాపులు నడుస్తున్నట్లు తెలిసింది.

చూసీచూడనట్లుగా ఎక్సైజ్ అధికారులు..?

ఆత్మకూరు సర్కిల్ పరిధిలో కొన్ని మద్యం షాపుల వారు దర్జాగా తమ దందా సాగిస్తున్నప్పటికీ బాధ్యతగా వ్యవహరించాల్సిన ఎక్సైజ్, పోలీసు అధికారులు పొలిటికల్ లీడర్స్ గుప్పిట్లో ఉన్నట్లు విమర్శలు వినిపిస్తున్నాయి. వాస్తవానికి షాపుల ఏర్పాటు మొదలుకొని నేటి వరకు పలు దుకాణాలు నిబంధనలు తుంగలో తొక్కేసినా అధికారులు సైతం చూసీచూడనట్టుగా వ్యవహరించాల్సిన పరిస్థితి నెలకొంది. అంతేగాకుండా బెల్ట్‌షాపుల్లో మద్యం ఏరులై పారుతున్నా కేసులు అంతంత మాత్రంగానే నమోదు చేస్తున్నారు. అదే పోలీసు శాఖ అధికారులు సైతం తమకెందులే అన్నట్లుగా మిన్నకుండిపోతున్నారు. ప్రధాన రోడ్ల పక్కనే తెరచాటున అనుమతులు లేకుండా గదులు ఏర్పాటు చేసి మద్యపానాన్ని ప్రోత్సహిస్తున్నా ప్రేక్షక పాత్ర పోషిస్తున్నారు. ఓపెన్ డ్రింక్ పేరుతో ఎక్కడెక్కడున్న వారిని డ్రోన్ కెమెరాలతో గుర్తించి శిక్షిస్తున్న పోలీసు అధికారులకు రోడ్ల పక్కనే జరుగుతున్న ఈ బాగోతం కనిపించకపోవడం లేదా అన్న విమర్శలు వ్యక్తమవుతున్నాయి. అదే క్రమంలో చిన్నపాటి కిరాణం షాపులకు కూడా సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని హెచ్చరికలు జారీ చేసే పోలీసులకు మద్యం దుకాణాల వద్ద సీసీ కెమెరాల ఏర్పాటు అంశంపై గుర్తుకు రాకపోవడం విస్మయానికి గురి చేస్తోంది.

సీఎం చెప్పినా తీరు మార్చుకోని వైనం



రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో కొత్త మద్యం పాలసీ ని ప్రవేశపెట్టింది. తొలుత మద్యం షాపుల టెండర్లలోనే కొంత మంది రాజకీయ నాయకు లు అత్యుత్సాహం ప్రదర్శించడంతో సీఎం చంద్రబాబే నేరుగా రంగంలోకి సదరు నేతలను హెచ్చరికలు జారీ చేసిన విషయం తెలిసిందే. అదే క్రమంలో మద్యం వ్యవహారంలో ప్రభుత్వానికి చెడ్డపేరు వచ్చేలా వ్యవహరిస్తే ఉపేక్షించేదే లేదని స్పష్టం చేసినా నేటికీ కొంతమంది తమ తీరును మార్చుకోవడం లేదని తెలుస్తోంది. గతంలో వైసీపీ నాయకులు కూడా ఇదే తరహాలో వ్యవస్థలను పరిగణలోకి తీసుకోకుండా ఇష్టారాజ్యంగా వ్యవహరించడం వల్లే ప్రజాగ్రహానికి గురి కావాల్సి వచ్చింది. అయినప్పటికీ అవేమీ పట్టించుకోకుండా మద్యంలో అక్రమార్జన లక్ష్యంగా కొంత మంది అధికార పార్టీ నాయకులు వ్యవహరిస్తున్న తీరు కూటమి ప్రభుత్వానికే తలవంపులు తీసుకొచ్చేలా ఉందన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. మొత్తానికి మద్యం ఇష్టారాజ్యం వ్యవహారంలో కూటమి పార్టీల పెద్దలు ఏవిధంగా స్పందిస్తారో వేచి చూడాల్సిందే మరి.

నిబంధనలు ఉల్లంఘిస్తే చర్యలు



నిబంధనలు ఉల్లంఘించిన మద్యం దుకాణాదారులపై విచారించి చర్యలు తీసుకుంటాం. అదే క్రమంలో గ్రామాల్లో బెల్టు షాపులు నిర్వహించడం చట్టరీత్యా నేరం. అలాంటి వాటిని తొలగిస్తాం. కొంతమంది జాతీయ రహదారుల పక్కనే మద్యం దుకాణాలను ఏర్పాటు చేసుకుని రాష్ట్ర ప్రభుత్వం ఇచ్చిన గజిట్‌పై హైకోర్టుకు వెళ్లి స్టే తెచ్చుకున్నారు. వాటిపై శాఖపరంగా మేము కౌంటర్లు దాఖలు చేస్తున్నాం. అందులో మాకు అనుకూలంగా తీర్పు వస్తే త్వరలోనే హైవేల పక్కనే ఉన్న మద్యం షాపులను కూడా నిబంధనల ప్రకారం దూరంగా తరలించేలా చూస్తాం. మాపై ఎలాంటి రాజకీయ ఒత్తిళ్లు లేవు. చట్టపరంగానే ముందుకెళ్తాం.

- రవికుమార్, ఎక్సైజ్ సూపరింటెండెంట్, నంద్యాల జిల్లా

మళ్లీ ఐదేళ్లకు..!

హంద్రీనీవా కాలువ విస్తరణ పనులను వైసీపీ హయాంలో అటకెక్కించారు. ఆ తర్వాత మళ్లీ ఐదేళ్లకు చంద్రబాబు సీఎం అయ్యాక రూ.696 కోట్లతో పనులు మొదలయ్యాయి. కరువు సీమకు పుష్కలంగా కృష్ణా జలాలు మళ్లించే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం ముందుకు వెళ్తున్నది. రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం రూ.1,030 కోట్లతో తొలి దశ విస్తరణ పనులకు శ్రీకారం చుట్టింది. వివిధ దశల్లో పనులు ఉండగా వైసీపీ ప్రభుత్వం రాకతో ఎక్కడి పనులు అక్కడే ఆగిపోయాయి. వైసీపీ ప్రభుత్వం కూడా పనులు కొనసాగించి ఉంటే మూడేళ్ల క్రితమే విస్తరణ పూర్తి అయ్యేది. కానీ వైసీపీ ప్రభుత్వం నిర్లక్ష్యంతో పనులు ఐదేళ్లపాటు ఆగిపోయాయి.


అసంపూర్తిగా పత్తికొండ జలాశయం

- గత టీడీపీ ప్రభుత్వ హయాంలో హంద్రీ నీవా విస్తరణకు శ్రీకారం
- రూ.1,030 కోట్లతో పనులు
- వైసీపీ అధికారంలోకి రాగానే ఆగిపోయిన పనులు
- రూ.6,182.19 కోట్లతో టెండర్ల డ్రామా..
- గంపెడు మట్టి కూడా తీయని వైనం
- మళ్లీ కూటమి ప్రభుత్వం రాకతో మొదలైన పనులు

మిగతా 7వ పేజీలో

కర్నూలు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాయలసీమ రైతుల జీవనాడి హంద్రీ నీవా సుజల స్రవంతి ఎత్తిపోతల పథకం ప్రధాన కాలువ విస్తరణకు ఎట్టకేలకు అడుగులు పడ్డాయి. టీడీపీ కూటమి ప్రభుత్వం దాదాపు రూ700 కోట్లతో పనులు మొదలు పెట్టారు. ఉమ్మడి కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాల్లో 6.05 లక్షల ఎకరాలకు సాగునీరు, 35 లక్షల జనాభాకు తాగునీరు ఇవ్వాలన్న లక్ష్యం. శ్రీశైలం జలాశయం ఎగువన నందికొట్కూరు మండలం మాల్యాల నుంచి 40 టీఎంసీలు కృష్ణా వరద జలాలు ఎత్తిపోసి కరువు నేలకు మళ్లించేలా హంద్రీనీవా ప్రాజెక్టు చేపట్టారు. తొలి దశ (ఫేజ్-1) కింద కర్నూలు జిల్లా మాల్యాల నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 216.30 కి.మీలు ప్రధాన కాలువ, 8 ఎత్తిపోతల పథకాలు నిర్మించారు. 3,850 క్యూసెక్కుల నీరు ఎత్తిపోసేందుకు వీలుగా హైడ్రాలికల్ పర్టిక్యులర్స్ ప్రకారం ప్రధాన కాలువ 9.5 మీటర్లు బెడ్ విడ్త్ (కాలువ అడుగు భాగం వెడల్పు)తో నిర్మించాలి. సీసీ లైనింగ్ చేస్తే 12 పంపులు ద్వారా 3,850 క్యూసెక్కులు (ఒక్కో పంపు ద్వారా 330 క్యూసెక్కులు) లిఫ్ట్ చేసేలా డిజైన్ చేశారు. ప్రస్తుతం 5-6 పంపుల ద్వారా 1,940 క్యూసెక్కులకు మించి ఎత్తిపోసుకోలేని పరిస్థితి ఉంది. సీసీ లైనింగ్ చేస్తే భూగర్భ జలాలపై తీవ్రమైన ప్రభావం పడుతుందని గుర్తించిన టీడీపీ కూటమి ప్రభుత్వం 3,880 క్యూసెక్కుల సామర్థ్యంతో విస్తరణకే మొగ్గు చూపింది. ఆరు నెలల్లో ఎంత తక్కువ లేదన్నా 60 టీఎంసీలు ఎత్తిపోసి నిల్వ చేస్తే కరువు సీమను సస్యశ్యామలం చేయవచ్చు.. తద్వారా రైతుల కష్టాలు తీర్చవచ్చని సీఎం చంద్రబాబు సంకల్పించారు.


కర్నూలు జిల్లా పత్తికొండ సమీపంలో హంద్రీ-నీవా ప్రధాన కాలువ

వైసీపీ హయాంలో నిర్లక్ష్యం

రాష్ట్ర విభజన తరువాత అప్పటి టీడీపీ ప్రభుత్వం 3,880 క్యూసెక్కులు హంద్రీనీవా ద్వారా తీసుకోవాలనే లక్ష్యంతో రూ.1,030 కోట్లతో కాలువ విస్తరణ పనులు చేపట్టారు. మూడు ప్యాకేజీలుగా విభజించి చేపట్టిన ఈ పనులు రుత్విక్, మెగా, హెచ్‌ఈఎస్ సంస్థలు చేపట్టాయి. దాదాపు రూ.285.77 కోట్లు ఖర్చు చేశారు. ఆ తరువాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం విస్తరణలో అవినీతి జరిగిందనే ఆరోపణలతో పనులు ఆపేసింది. విస్తరణకు జగన్ గ్రహణం పట్టింది. హంద్రీనీవా కాలువను 6,300 క్యూసెక్కుల విస్తరిస్తామంటూ రూ.6,182.19 కోట్లతో టెండర్లు పిలిచారు. కాంట్రాక్ట్ సంస్థలతో ఒప్పందం చేసుకున్నారు. కానీ వైసీపీ అధికారంలో ఉన్నంత కాల గంపెడు మట్టి కూడా తీయలేదు.

లోకాయుక్తలో భారీగా కేసులు

- అత్యధికంగా ఉమ్మడి కర్నూలు జిల్లావే..

కర్నూలు లీగల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): లోకాయుక్తలో ఈ ఏడాది భారీగా కేసులు దాఖలైనట్లు రాష్ట్ర ఉప లోకాయుక్త పి. రజని తెలియజేశారు. సోమవారం జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ ఈ ఏడాది 2,597 ఫిర్యాదులు దాఖలు కాగా అందులో 2,327 పరిష్కరించినట్లు తెలిపారు. ఇందులో 567 కేసులు ఉమ్మడి కర్నూలు జిల్లా నుంచే దాఖలైనట్లు ఆమె చెప్పారు. విజయవాడ, విశాఖపట్నం, రాష్ట్రం నలుమూలల నుంచి దాఖలైన ఈ కేసుల్లో ఎక్కువ కేసులు త్వరగా పరిష్కారమైనందుకు ప్రజల్లో లోకాయుక్త పట్ల నమ్మకం ఏర్పడిందని అన్నారు. లోకాయుక్త పట్ల ప్రజల్లో మరింత అవగాహన పెరిగేందుకు కృషి చేస్తున్నామని అన్నారు. ఈ మేరకు క్యాంపు కోర్టులను కూడా నిర్వహించడానికి ప్రయత్నిస్తున్నామని ఆమె వెల్లడించారు.

కేంద్రీయ విద్యాలయానికి స్థల పరిశీలన

- డోన్‌లో అనంతపురం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్


డోన్ ఐటీఐలో ఉన్న నూతన భవనాన్ని పరిశీలిస్తున్న అనంతపురం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కండేయ

డోన్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): డోన్‌లో కేంద్రీయ విద్యాలయం ఏర్పాటుకు అవసరమైన స్థలం పరిశీలన కోసం అనంతపురం కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపాల్ మార్కండేయ సోమవారం డోన్‌కు వచ్చారు. డీఈవో జనార్దన్ రెడ్డి, ఆర్డీవో నరసింహులు, తహసీల్దార్ నాగమణి, మండల విద్యాధికారి ప్రభాకర్‌లతో కలిసి పట్టణ సమీపంలోని పేరంటాలమ్మ గుడి వద్ద స్థలాన్ని పరిశీలించారు. అనంతరం డోన్ పట్టణంలోని ప్రభుత్వ ఐటీఐలో నూతనంగా నిర్మించిన భవనాన్ని కేంద్రీయ విద్యాలయం కోసం వారు పరిశీలించారు. ఆంధ్రప్రదేశ్‌లో 8 కేంద్రీయ విద్యాలయాలు మంజూరయ్యాయని, ఇందులో భాగంగా డోన్‌కు మంజూరైన కేంద్రీయ విద్యాలయంలో ఏప్రిల్ 1వ తేదీ నుంచి తరగతులు ప్రారంభం కానున్నాయని ప్రిన్సిపాల్ అన్నారు. ఈ నివేదికను కేంద్రానికి పంపనున్నట్లు ఆయన తెలిపారు.

మళ్లీ ఐదేళ్లకు..!

కూటమి ప్రభుత్వం వచ్చాక విస్తరణపై దృష్టి

(5వ పేజీ తరువాయి)

సీఎం చంద్రబాబు సారథ్యంలోని కూటమి ప్రభుత్వం కొలువుదీరాక తిరిగి హంద్రీ నీవా కాలువ విస్తరణపై దృష్టి సారించారు. గత ఏడాది సెప్టెంబరులో జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామానాయుడు హంద్రీ నీవా కాలువను పరిశీలించారు. ఫేజ్-1లో భాగంగా 0/0 కిలోమీటర్ల నుంచి 88 కి.మీల వరకు రూ.250 కోట్లతో ప్యాకేజీ-1 కింద చేపట్టి విస్తరణ బ్యాలెన్స్ పనులు హైదరాబాద్‌కు చెందిన మెగా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్ లిమిటెడ్ కంపెనీ, 88 కి.మీల నుంచి 216.30 కిలోమీటర్లు అనంతపురం జిల్లా జీడిపల్లి రిజర్వాయర్ వరకు రూ.450 కోట్లతో చేపట్టిన విస్తరణ బ్యాలెన్స్ పనులు ప్యాకేజీ-2 డీఎస్‌ఆర్-వీపీఆర్ జాయింట్ వెంచర్ కింద చేపట్టారు. హంద్రీనీవా ఇంజనీర్లతో ఒప్పందం చేసుకొని వారం పది రోజుల క్రితం పనులకు శ్రీకారం చుట్టారు. సీసీ లైనింగ్ చేపట్టకుండా కాలువను విస్తరించడం వల్ల కాలువ పక్కన ఉండే నందికొట్కూరు, పాణ్యం, పత్తికొండ, డోన్, ఆలూరు నియోజకవర్గాల్లో భూగర్భ జలాలు పెరుగుతాయని, తద్వారా బోరుబావుల కింద సాగు పెరుగుతుందని, తాగునీటి సమస్య తీరుతుందని నిపుణులు పేర్కొంటున్నారు. జూన్ 15వ తేదీలోగా విస్తరణ పనులు పూర్తి చేయాల్సి ఉంది. అయితే ఈ ఆరు నెలల్లో సాధ్యమేనా..? అనే సందేహాలు వ్యక్తం అవుతున్నాయి.

విస్తరణ పనులు మొదలు పెట్టాం

నంద్యాల జిల్లా మాల్యాల పంప్‌హౌస్-1 నుంచి అనంతపురం జిల్లా జీడిపల్లి జలాశయం వరకు 0/0 నుంచి 216.30 కిలోమీటర్ల దాకా 3,880 క్యూసెక్కుల సామర్థ్యంలో 2018లో రూ.1,030 కోట్లతో విస్తరణ పనులు చేపట్టారు. కొంత వరకు పనులు చేశారు. ఆ తరువాత ప్రభుత్వం పనులు ఆపేసింది. చంద్రబాబు ప్రభుత్వం వచ్చాక హంద్రీనీవా విస్తరణ బ్యాలెన్స్ పనులకు ప్రతిపాదనలు పంపితే పరిపాలనా అనుమతులు ఇచ్చారు. టెండర్లు ప్రక్రియ పూర్తి చేసి దాదాపు రూ.696 కోట్లతో రెండు ప్యాకేజీల కింద విస్తరణ బ్యాలెన్స్ పనులు మొదలయ్యాయి. జూన్ రెండో వారంలోగా పూర్తి చేయాలని కాంట్రాక్ట్ సంస్థలకు గడువు పెట్టాం.

- నాగరాజు, హంద్రీనీవా ప్రాజెక్టు సీఈ, అనంతపురం జిల్లా

స్పర్శ కుష్ఠు వ్యాధిపై అవగాహన



పోస్టర్‌ను విడుదల చేస్తున్న కలెక్టర్ రంజిత్ బాషా

కర్నూలు కలెక్టరేట్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో ఈ నెల 30 నుంచి ఫిబ్రవరి 13వ తేదీ వరకు స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని కలెక్టర్ పి.రంజిత్ బాషా అన్నారు. సోమవారం సునయన ఆడిటోరియంలో స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ ఈ నెల 30న జాతిపిత మహాత్మా గాంధీ వర్ధంతి సందర్భంగా కుష్ఠు వ్యాధిగ్రస్థులకు చేసిన సేవలను స్మరించుకుంటూ స్పర్శ కుష్ఠు వ్యాధి అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించుకుంటున్నామన్నారు. సంబంధిత శాఖల అధికారులు సమష్టి కృషితో జిల్లాను కుష్ఠు రహిత జిల్లాగా చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా కుష్ఠు ఎయిడ్స్ మరియు టీబీ అధికారి డా.ఎల్.భాస్కర్ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డా.పి.శాంతికళ, జిల్లా న్యూక్లియస్ వైద్యాధికారి డా.జి.మల్లికార్జున రెడ్డి, జి.విజయప్రకాష్, వై.సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

ప్రాజెక్టులను పూర్తి చేయాలి

- జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి. మురళీకృష్ణ



ప్రాజెక్టు పనుల వద్ద డీసీసీ అధ్యక్షుడు మురళీకృష్ణ

కర్నూలు అర్బన్, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పందికోన, వేదవతి ప్రాజెక్టుల పనులను వెంటనే పూర్తి చేయాలని జిల్లా కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు పి.మురళీకృష్ణ అన్నారు. సోమవారం జిల్లా కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పత్తికొండ నియోజకవర్గం పందికోన రిజర్వాయర్‌ను జిల్లా బృందం సందర్శించిందని తెలిపారు. ఈ రిజర్వాయర్ ద్వారా రెండు లక్షల ఎకరాలకు సాగు నీరు ఇవ్వడం లేదన్నారు. రాయలసీమ ఉమ్మడి జిల్లాలైన కర్నూలు, అనంతపురం, చిత్తూరు, కడప జిల్లాలకు సాగు, తాగు నీరు ఇవ్వాలని ఉన్నా అధికారులు అమలు చేయడం లేదని అన్నారు. ఫిబ్రవ రిలో నీటిని ఆపకుండా ఖరీఫ్ సీజన్ వరకు రైతులకు నీరందించాలని కోరారు. లేనిపక్షంలో రాయలసీమ జిల్లాల రైతులతో పెద్దఎత్తున నిరసన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు. ఆలూరు నియోజకవర్గం పరిధిలోని హాలహర్వి మండలం అమృతాపురం గ్రామం వద్ద గల వేదవతి ప్రాజెక్టు 2014లో అప్పటి టీడీపీ ప్రభుత్వం శంకుస్థాపన చేసిందని, రూ.1800 కోట్లు కేటాయించిందని గుర్తు చేశారు. అనంతరం 2019లో వచ్చిన వైసీపీ ప్రభుత్వం రివర్స్ టెండరింగ్ పేరుతో రూ.1600 కోట్లకు కుదించిందని, ప్రాజెక్టు కింద భూములు కోల్పోయిన రైతులకు ఇంత వరకు నష్టపరిహారం అందలేదని అన్నారు. ప్రాజెక్టు పనులు శంకుస్థాపనకే పరిమితమయ్యాయని, ప్రస్తుత ప్రభుత్వం స్పందించి పనులు ప్రారంభించాలని డిమాండ్ చేశారు. సమన్వయకర్తలు, ఎం.కాశీం వలీ, చిప్పగిరి లక్ష్మీనారాయణ, జి. రమేష్‌యాదవ్, ఓబీసీ చైర్మన్ డీవీ సాంబశివుడు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

ఆ యువకుడు దొరికాడు

- కుటుంబ సభ్యులకు అప్పగించిన పోలీసులు



యువకుడిని కుటుంబ సభ్యులకు అప్పగిస్తున్న పోలీసులు

ఆత్మకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఆత్మకూరు పట్టణంలో సంచలనంగా మారిన యువకుడి అదృశ్యం కథ సుఖాంతమైంది. ఎట్టకేలకు పోలీసులకు దొరికాడు. అతడ్ని ఆత్మకూరుకు రప్పించి కుటుంబ సభ్యులకు అప్పగించారు. ఈ మేరకు సోమవారం స్థానిక డీఎస్పీ కార్యాలయంలో డీఎస్పీ రామాంజినాయక్ మీడియా సమావేశం ఏర్పాటు చేసి వివరాలు వెల్లడించారు. ఆత్మకూరు పట్టణంలోని తిక్కయ్యస్వామి దర్గా సమీపంలో నివసిస్తున్న ఆర్టీసీ డ్రైవర్ మహెబూబ్‌బాషా కుమారుడైన నిరంజన్ ఓ ప్రైవేట్ ఫైనాన్స్ కంపెనీలో పనిచేస్తున్నాడు. ఈ క్రమంలో బెట్టింగ్ యాప్‌ల వల్ల యువకుడు రూ.13 లక్షల వరకు నష్టపోయాడు. అప్పులు ఎలా తీర్చాలో తెలియక ఈ నెల 24న సూసైడ్ లెటర్ రాసి ఇంటి నుంచి వెళ్లిపోయారు. దీంతో ఆ యువకుడి కుటుంబ సభ్యులు పోలీసులను ఆశ్రయించారు. వారు అతని ఆచూకీ కోసం అనేక విధాలుగా ప్రయత్నించారు. చివరకు విజయవాడలో దొరికాడు. అక్కడి పోలీసులు నిరంజన్‌ను ఆత్మకూరుకు తీసుకొచ్చారు. సోమవారం ఆత్మకూరు తహసీల్దార్ రత్నరాధిక సమక్షంలో నిరంజన్‌ను వారి కుటుంబసభ్యులకు అప్పగించారు. కాగా కేసును త్వరితగతిన ఛేదించిన ఆత్మకూరు సీఐ రామును డీఎస్పీ అభినందించారు. ఆ తర్వాత యువకుడికి కౌన్సిలింగ్ ఇచ్చారు.

విద్యార్థులను చితకబాదిన హెచ్‌ఎం

- మద్యం మత్తులో వీరంగం
- పాఠశాలకు తాళం వేసిన గ్రామస్థులు
- సస్పెండ్ చేస్తూ డీఈవో ఆదేశాలు



పాఠశాలకు తాళం వేస్తున్న గ్రామస్థులు

హొళగుంద, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మద్యం మత్తులో ఓ హెచ్‌ఎం విద్యార్థులను చితక బాదాడు. దీంతో తల్లిదండ్రులు ఆగ్రహించి పాఠశాలకు తాళం వేశారు. ఈ ఘటన హొళగుంద మండ లం ముద్దటమాగి గ్రామంలో చోటుచేసుకుంది. గ్రామస్థుల వివరాల మేరకు.. ముద్దటమా గి మండల పరిషత్ ఆదర్శ ప్రాథమిక పాఠశాలలో 160 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఈ పాఠశాల ప్రధానోపాధ్యాయుడిగా జయరాజు విధులు నిర్వహి స్తున్నాడు. సోమవారం పాఠశాలకు వచ్చిన ఆయన 11 గంటల సమయంలో పాఠశాలలో ని మరుగుదొడ్డి లోకి వెళ్లి మద్యం తాగడం మొదలు పెట్టాడు. మద్యం తాగుతుండడాన్ని ఓ విద్యార్థి చూడగా ఇక్కడికి ఎందుకు వచ్చావని గట్టిగా అరిచాడు. అనంతరం హెచ్‌ఎం తరగతి గదిలోకి వెళ్లి తలుపులు వేసి విద్యార్థులను ప్లాస్టిక్ పైప్‌తో చితకబాదాడు. విద్యార్థులు కేకలు విన్న గ్రామస్థులు పాఠశాల వద్దకు వెళ్లారు. విద్యార్థులు విషయాన్ని ఏడుస్తూ చెప్పడంతో ప్రధానోపాధ్యాయుడు జయరాజుతో వాగ్వాదానికి దిగారు. మండల విద్యాధికారి జగన్నాథంకు సమాచారం ఇచ్చారు. ఆయన పాఠశాలకు వచ్చి విచారణ చేపట్టారు. హెచ్‌ఎం జయరాజును పాఠశాల నుంచి తొలగించాలని, లేకపోతే ఆందోళన చేపడతామని తల్లిదండ్రులు హెచ్చరించారు. ఇలాంటి ఉపాధ్యాయుడు ఉన్న పాఠశాలకు పిల్లలను పంపించబోమని పాఠశాలకు తాళం వేసి విద్యార్థులను ఇళ్లకు పంపించారు. విషయం డీఈవో దృష్టికి ఎంఈవో తీసుకువెళ్లగా ఆయనను సస్పెండ్ చేస్తూ క్రిమినల్ కేసు నమోదు చేయాలని డీఈవో శ్యామ్యూల్‌పాల్ ఆదేశాలు జారీ చేశారు.

హెచ్‌ఎంపై చర్య

కర్నూలు ఎడ్యుకేషన్: హొళగుంద మండలం ముద్దటమాగి ఆదర్శ ప్రాథమిక పాఠశాల ప్రధానో పాధ్యాయుడు జయరాజు సస్పెండ్ అయ్యాడు. మద్యం మత్తులో విద్యార్థులను చితకబాదిన ఘటనలో ఉపాధ్యాయుడిని సస్పెండ్ చేస్తూ డీఈవో శ్యామ్యూల్ పాల్ ఉత్తర్వులు జారీ చేశారు. పాఠశాల టాయిలెట్‌లో విద్యార్థులు మద్యం సీసాలు చూశారన్న ఆగ్ర హంతో విద్యార్థులను చితకబా దారని ఎంఈవో జగన్నాథం నివేదిక ఇచ్చారు. ఈ మేరకు హెచ్‌ఎం ను సస్పెండ్ చేసినట్లు ఉత్తర్వులు ఇచ్చారు.

క్షుద్ర పూజల కలకలం

కర్నూలు క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): తాలుకా పోలీస్ స్టేషన్ పరిధిలోని ఎస్ఆర్ కాలేజీలో ఓ బాలికపై క్షుద్ర పూజలు జరిగినట్లు కలకలం రేగింది. శ్రీశైలానికి చెందిన విద్యార్థిని స్థానిక ఎస్ఆర్ కాలేజీలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతోంది. ఆదివారం రాత్రి తర్వాత ఆ విద్యార్థిని జుట్టు కత్తిరించి నిమ్మకాయలు కోసి ఓ లెటరు రాసి ఆ యువతి సమీపంలో పెట్టారు. 'మాకన్నా ఎలా బాగా చదువుతావు.. మేం చూస్తాం' అని అందులో రాశారు. ఆ తర్వాత ఆ విద్యార్థిని చెయ్యి తెగినట్లుగా ఉండడాన్ని కళాశాల యజమాన్యం గమనించి ప్రథమ చికిత్స చేయించింది. తల్లిదండ్రుల దృష్టికి ఈ విషయం వెల్లడంతో సోమవారం రాత్రి కళాశాలకు వద్దకు చేరుకుని ఆందోళన చేశారు. విద్యార్థి సంఘాల నాయకులు కళాశాల అద్దాలు, ఫర్నీచర్‌ను ధ్వంసం చేశారు. కళాశాలలో సీసీ కెమెరాలు లేకపోవడంతో పోలీసులు సందేహాలు వ్యక్తం చేస్తున్నారు. అనంతరం తాలుకా పోలీస్‌స్టేషన్‌కు వెళ్లి కళాశాలలో జరిగిన సంఘటనపై విచారించి సీసీ కెమెరాలు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. సీఐ శ్రీధర్‌ను వివరణ కోరగా.. కళాశాలలో జరిగిన సంఘటన తమ దృష్టికి వచ్చిందని, తల్లిదండ్రులు ఫిర్యాదు చేయలేదని అన్నారు. జరిగిన సంఘటనపై విచారిస్తున్నామని తెలిపారు.

రాజకీయాల్లో యువగళం ఓ మలుపు

- నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు రాజశేఖర్



మాట్లాడుతున్న మల్లెల రాజశేఖర్

ఓర్వకల్లు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర రాజకీయాల్లోనే యువగళం పాదయాత్ర ఓ పెద్ద మలుపు అని నంద్యాల జిల్లా టీడీపీ అధ్యక్షుడు, టీటీడీ బోర్డు సభ్యుడు మల్లెల రాజశేఖర్ అన్నారు. చారిత్రాత్మక యువగళం పాదయాత్ర ప్రారంభమై రెండేళ్లు పూర్తయిన సందర్భంగా హుశేనాపురంలో సోమవారం ఆయన మాట్లాడారు. యువ నేత, ఐటీ, విద్యాశాఖ మంత్రి లోకేశ్ ఐదేళ్ల అరాచక వైసీపీ పాలనపై సమరశంఖం పూరించారని అన్నారు. రాష్ట్రంలోని ఐదు కోట్ల మంది ఆశలు, ఆశయాలను ప్రతిబింబిస్తూ యువనేత పాదయాత్ర సాగిందని తెలిపారు. రాష్ట్రంలోని 11 ఉమ్మడి జిల్లాల్లో 97 అసెంబ్లీ నియోజ కవర్గాలు, 232 మండలాలు, 2097 గ్రామాల మీదుగా 226 రోజుల పాటు 3132 కిలోమీటర్ల మేర యువగళం పాదయాత్ర జరిగిందని గుర్తు చేశారు. ప్రజల కష్టాలు వింటూ, కన్నీళ్లు తుడుస్తూ సాగిన పాదయాత్ర ప్రజా క్షేత్రంలో సంపూర్ణ విజయం సాధించిందన్నారు. యువగళం సాగిన 97 అసెంబ్లీ నియోజకవర్గాల్లో 90 చోట్ల కూటమి అభ్యర్థులు విజయం సాధించారంటే పాదయాత్ర ఎంతటి ప్రభావం చూపిందో అర్థం చేసుకోవచ్చన్నారు. జగన్ రెడ్డి ఎన్ని అడ్డంకులు సృష్టించినా తగ్గేదే లేదంటూ పట్టుదలతో పాదయాత్ర చేశారన్నారు. 124 రోజుల పాటు 44 అసెంబ్లీ నియోజకవర్గాల మీదుగా 1587 కిలోమీటర్ల మేర రాయలసీమలో యువగళం పాదయాత్ర దిగ్విజయంగా సాగిందని తెలిపారు. ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు తొలి సంతకం డీఎస్సీపై చేశారని, ఐదేళ్లలో 20 లక్షల ఉద్యోగాలు కల్పించడమే ధ్యేయమని చెప్పిన విధంగా హామీలు అమలు చేస్తున్నారని తెలిపారు. ఈ కార్యక్రమంలో నాయకులు కేవీ మధు, బజారు, విక్రమ్, తదితరులు పాల్గొన్నారు.

స్ఫూర్తి నింపిన యువగళం



కేక్ కట్ చేస్తున్న పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి

- పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరిత

కర్నూలు క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): వైసీపీ అరాచకాలకు చరమగీతం పాడి యువతలో భవిష్యత్‌పై స్ఫూర్తి నింపేలా టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ యువగం పాదయాత్ర సాగిందని పాణ్యం ఎమ్మెల్యే గౌరు చరితారెడ్డి తెలిపారు. యువగళం పాదయాత్ర రెండేళ్లు పూర్తయిన సందర్భంగా సోమవారం సాయంత్రం స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో టీడీపీ శ్రేణులతో కలిసి ఆమె కేక్ కట్ చేసి సంబరాలు చేసుకున్నారు.

ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ రాష్ట్రంలో 5 కోట్ల మంది ఆశలు, ఆశయాలను ప్రతిభింబిస్తూ కుప్పం వరదరాజస్వామి పాదాల చెంత నుంచి 2023 జనవరి 27వ తేదీన పాదయాత్రగా ప్రజల్లోకి వెళ్లిన యువనేత నారా లోకేశ్ యువగళంతో రాష్ట్ర రాజకీయాలను మార్చేశారన్నారు. ఉద్యోగాల్లేక నిరాశతో కొట్టుమిట్టాడుతున్న యువత ఒక వైపు ఇంటి నుంచి బయటకు వెళ్లే తిరిగి క్షేమంగా వస్తామనే గ్యారెంటీ లేక భయాందోళనలో మహిళలు మరోవైపు గగ్గోలు పెడుతున్న సమయంలో వారందరిలో స్ఫూర్తిని నింపి ముందుకు నడిపించి ప్రగతిపథం వైపు అడుగులేసేలా చేశారన్నారు.

ఈ కార్యక్రమంలో మాజీ మార్కెట్ యార్డు చైర్మన్, కన్వీనర్ పెరుగు పురుషోత్తంరెడ్డి, తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ప్రభాకర్ యాదవ్, మాజీ సింగిల్ విండో ప్రెసిడెంటు రామకృష్ణ, తెలుగు యువత నాయకుడు గంగాధర్‌గౌడు, నాయకులు శ్రీనివాసరెడ్డి, రమేష్ యాదవ్, రామాంజనేయులు, జనసేన బజారన్న తదితరులు పాల్గొన్నారు.

బనగానపల్లెలో చోరీ

- 6 తులాల బంగారు, రూ.లక్ష నగదు అపహరణ

బనగానపల్లె, జనవరి 27(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని జమ్మిరెడ్డి కాలనీలో నివాసం ఉంటున్న వ్యాపారి చిన్నపురెడ్డి ఇంట్లో సోమవారం చోరీ జరిగింది. చిన్నపురెడ్డి సతీమణి సుజాత పుట్టినిళ్లు మహానంది మండలం తమ్మడపల్లెకు వెళ్లింది. చిన్నపురెడ్డి టిఫిన్ చేసి వ్యాపారం నిమిత్తం వెళ్లాడు. ఉదయం 9గంటల అనంతరం చిన్నపురెడ్డి బయటకు వెళ్లిపోగా దొంగలు తలుపుల తాళాలు పగులగొట్టి ఇంటిలోకి ప్రవేశించారు. బీరువాలో ఉన్న రూ. లక్ష నగదు, ఆరు తులాల బంగారు చోరీ చేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసినట్టు ఎస్ఐ దుగ్గిరెడ్డి తెలిపారు. ఫోరెనిక్స్ నిపుణులను రప్పించి ఫింగర్ ప్రింట్ తీసినట్లు ఆయన పేర్కొన్నారు.

గోపవరంలో..

మహానంది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహానంది మండలం గోపవరం గ్రామంలోని ఒక ఇంటిలో ఆదివారం అర్ధరాత్రి చోరీ జరిగినట్లు తెలిసింది. గ్రామ ప్రధాన కూడలిలోని సుంకులమ్మ ఆలయ సమీపంలోని ఒక ఇంట్లో ఎవ్వరూ లేని సమయం చూసి గుర్తు తెలియని వ్యక్తులు చోరీకి పాల్పడి ఇంట్లోని బీరువాను పగల కొట్టి విలువైన వస్తువులు, పత్రాలను దొంగలించుకొని వెళ్ళినట్లు సమాచారం. ఇంటి యజమాని బంధువుల శుభకార్యక్రమం కోసం వేరే ఊరికి వెళ్ళినట్లు తెలిసింది. చోరి విషయంపై మహానంది ఎస్ఐ రామ్మోహన్‌రెడ్డిని వివరణ కోరగాఈ విషయంపై తమకు ఎలాంటి ఫిర్యాదు రాలేదని చెప్పారు.

వివాహిత అదృశ్యం

గడివేముల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బిలకలగూడురు గ్రామానికి చెందిన మహిళ అదృశ్యమైంది. గ్రామానికి చెందిన సుజాత ఈ నెల 21వ తేదీ నుంచి కనపడటం లేదని కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. భర్త మూడేళ్ల క్రితం మరణించాడని, ఒక కొడుకు, కూతురు ఉన్నారని వారు తెలిపారు. సుజాత మామ పెద్దనారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి, ఆమె కోసం వెతుకుతున్నట్లు ఎస్ఐ నాగార్జున్‌రెడ్డి తెలిపారు.

గురుకులం నుంచి వెళ్లిపోయిన విద్యార్థులు

- ఎమ్మిగనూరులో పట్టుకున్న పోలీసులు

సి. బెళగల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని గురుకులం పాఠశాల నుంచి వెళ్లిపోయిన విద్యార్థులను సోమవారం ఎమ్మిగనూరు పోలీసులు పట్టుకొని ప్రిన్సిపాల్‌కు అప్పగించారు. వివరాలు ఇలా ఉన్నాయి.. మండల కేంద్రంలో అంబేడ్కర్ గురుకుల పాఠశాలలో నవీన్ ఏడో తరగతి, సూర్యతేజ ఆరో తరగతి చదువుతున్నారు. వీరిద్దరూ అక్కాచెల్లెళ్ల పిల్లలు. కోసిగి మండలం జంపాపురం గ్రామానికి చెందిన నవీన్, కర్నూలు నగరంలోని బుధవారపేటకు చెందిన సూర్యతేజ కలిసి సోమవారం మధ్యాహ్నం మూడున్నర గంటల ప్రాంతంలో పాఠశాల నుంచి ఆటో ఎక్కిపోయారు. వీరు ఆటో ఎక్కిపోవడాన్ని చూసిన విద్యార్థి మిథిన్ గురుకుల పాఠశాల ప్రిన్సిపాల్ విజేయుడుకు సమాచారం ఇచ్చారు. ప్రిన్సిపాల్ సి.బెళగల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేయడంతో గాలింపు ముమ్మరం చేశారు. అయితే మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్ ఈ విషయాన్ని ఫేస్‌బుక్ గ్రూపులో షేర్ చేశాడు. దీంతో ఎమ్మిగనూరులో మెడికల్ స్టోర్ నడుపుకుంటున్న జూలకల్ మిన్నెల్ల ఫేస్‌బుక్‌లో వచ్చిన విద్యార్థులను శివ సర్కిల్ చూసి వారు వీరేనని గుర్తు పట్టాడు. అనంతరం వారిని తీసుకెళ్లి ఎమ్మిగనూరు పోలీసులకు అప్పగించారు. అనంతరం వారు కోడుమూరు సీఐ తబ్రేజ్, ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులకు సమాచారం ఇచ్చారు. వారు పిల్లలను సి.బెళగల్‌కు తీసుకొచ్చి ప్రిన్సిపాల్ విజేయుడుకు అప్పగించారు. విద్యార్థులను గుర్తు పట్టి ఎమ్మిగనూరు పోలీసులకు అప్పగించిన మిన్నెల్లను, ఫేస్‌బుక్‌లో షేర్ చేసిన సి.బెళగల్ మాజీ జడ్పీటీసీ చంద్రశేఖర్‌ను సీఐ సన్మానించారు. కార్యక్రమంలో గూడూరు ఎస్ఐ తిమ్మయ్య, స్థానిక ఎస్ఐ తిమ్మారెడ్డి, పోలీసులు ఉన్నారు.

నేడు 20 సూత్రాల అమలు సమావేశం

నంద్యాల కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన 20 సూత్రాల అమలు పథకం విస్తృత స్థాయి సమావేశం మంగళవారం ఉదయం 9.30 గంటలకు కలెక్టరేట్‌లోని సెంటనరీ హాలులో జరుగుతుంది. నంద్యాల కలెక్టర్ రాజకుమారి, 20 సూత్రాల అమలు పథకం చైర్మన్ లంకా దినకర్, నంద్యాల ఎంపీ బైరెడ్డి శబరి, ఎమ్మెల్యేలు, జిల్లాలోని మున్సిపల్ చైర్మన్లు, కౌన్సిలర్లు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, ఎంపీటీసీలు, వార్డు మెంబర్స్ ఇతర స్థానిక ప్రజా ప్రతినిధులు అందరూ పాల్గొని తమ గ్రామ, వార్డులలోని సమస్యలు జిల్లా స్థాయి అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారం కోసం కృషి చేయాలని తెలిపారు. అలాగే బీజేపీ కార్యాలయంలో మంగళవారం మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 4గంటల వరకు 20 సూత్రాల అమలు పథకం చైర్‌పర్సన్ లంకా దినకర్ విలేకరుల సమావేశం, ప్రజల నుండి వినతులు స్వీకరిస్తున్నట్లు తెలిసింది.

నాణ్యమైన పరిష్కారం చూపండి

- ఎంఎస్ఎంఈ సర్వేపై దృష్టి పెట్టాలి
- కలెక్టర్ రాజకుమారి
- పీజీఆర్ఎస్‌కు 189 దరఖాస్తులు



ఫిర్యాదులు స్వీకరిస్తున్న కలెక్టర్ రాజకుమారి

నంద్యాల కల్చరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రజా సమస్యలను క్షేత్రస్థాయిలో పరిశీలించి నాణ్యంగా, వేగంగా పరిష్కరించాలని కలెక్టర్ రాజకుమారి అధికారులను ఆదేశించారు. సోమవారం కలెక్టరేట్‌లోని పీజీఆర్ఎస్ హాలులో ప్రజా సమస్యల పరిష్కారవేదికలో జిల్లా నలుమూలల నుంచి వచ్చిన ప్రజల నుండి ఫిర్యాదులను స్వీకరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ మండల, డివిజన్, మున్సిపల్ స్థాయిలో జరిగిన జీజీఆర్ఎస్ మినిట్స్ సిఎంఓ పీజీఆర్ఎస్ గ్రూపులో నోడల్ అధికారికి పోస్ట్ చేయాలన్నారు. రీసర్వే గ్రామసభలు, రెవెన్యూ సదస్సుల ద్వారా స్వీకరించిన దరఖాస్తులను వెబ్‌పోర్టల్‌లో అప్‌లోడ్ చేసి నిర్ణీత వ్యవధిలోగా పరిష్కరించడంతో పాటు ఆడిట్ చేయాలని అన్నారు. పరిష్కరించ దగిన సమస్యను వెంటనే పరిష్కరించాలన్నారు. పత్రికల్లో వచ్చే ప్రతికూల వార్తలపై వెంటనే స్పందించి వాస్తవాలు నిర్ధారణ చేసుకొని సరి చేసుకోవడంతోపాటు రీజాయిన్డెర్లు ఇవ్వాలని కలెక్టర్ ఆదేశించారు. గ్రామ, వార్డు సచివాలయం సిబ్బందిచే ఎంఎస్ఎంఈ సర్వే పూర్తి చేయించాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలను కలెక్టర్ ఆదేశించారు. హౌస్ హోల్డ్ మాపింగ్ సంబంధించి డీఈవో, పోలీస్, ఇరిగేషన్, రెవెన్యూ, వైద్య ఆరోగ్యం తదితర శాఖలో 68,593 మంది మ్యాపింగ్ పెండింగులో ఉందని, రెండురోజుల్లో పూర్తిచేయాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. జిల్లాలో 40 దరఖాస్తులు రీఓపన్ అయ్యాయని, 27 సీఎంఓ దరఖాస్తులు కూడా రీఓపన్ అయ్యాయని వీటన్నిటిని తక్షణమే పరిష్కరించాలని కలెక్టర్ ఆదేశించారు. ప్రజా ఫిర్యాదులన్నింటినీ చివరి 71 గంటల్లోగా నాణ్యంగా పరిష్కరించాలన్నారు. కోవెలకుంట్ల మండలంలో ఎస్ఆర్బీసీ కాలువ ఓవర్ ఫ్లో కారణంగా 140 హెక్టార్లలో శనగ పంట దెబ్బతినిందని, వ్యవసాయ శాఖ, ఎస్ఆర్బీసీ జాయింట్ నివేదికలు ఇస్తే ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపిస్తామన్నారు. జాయింట్ కలెక్టర్ విష్ణుచరణ్ మాట్లాడుతూ జిల్లాలో నమోదు చేయని 15వే ల ఎకరాలను వారం రోజులలో నమోదు చేసి తహసీల్దార్, ఆర్డీఓ లాగిన్‌ల నుండి పంపాలన్నారు. రెవిన్యూ సదస్సుల్లో స్వీకరించిన దరఖాస్తులను క్షేత్రస్థాయిలో పరిశీలించి నిర్ణీత కాలపరిమితిలోగా పరిష్కరించాలన్నారు. డీఆర్ఓ రామునాయక్, స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు, అధికారులు పాల్గొన్నారు.

జాతీయ రహదారిపై యూటర్న్ ఏర్పాటు చేయాలి



రాస్తారోకో చేస్తున్నప్రజలు, ప్రజాప్రతినిధులు

జూపాడుబంగ్లా, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): జాతీయ రహదారిపై యూటర్న్ ఏర్పాటు చేయాలని ప్రజలు డిమాండ్ చేశారు. తంగడంచ చెక్‌పోస్టు నుంచి పారుమంచాల, తూడిచర్ల, వెలుగోడు, తంగడంచ గ్రామాలకు బస్సులు, వాహనాలు, ఆటోలు రావాలంటే జూపాడుబంగ్లా పోలీసుస్టేషన్ వద్ద యూటర్న్ ఏర్పాటు చేస్తే తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటామని వివిధ గ్రామాల ప్రజలు సోమవారం రాస్తారోకో చేపట్టారు. వారు మాట్లాడుతూ రెండు కిలోమీటర్లు ముందుకు వెళ్లి మళ్లీ తిరిగి రావాలంటే మొత్తం నాలుగుకిలోమీటర్లు అవుతుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాస్తారోకోతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. జూపాడుబంగ్లా ఎస్ఐ లక్ష్మీనారాయణ ఘటన స్థలానికి చేరుకుని జాతీయ రహదారి అధికారులతో ఫోన్లో మాట్లాడారు. కార్యక్రమంలో తూడిచర్ల, పారుమంచాల సర్పంచులు బాలమద్దిలేటి, ప్రకాశం, టీడీపీ నాయకులు దేవసహాయం, రసూల్, సీపీఎం నాయకులు కర్ణ, రాముడు పాల్గొన్నారు.

మహానందిలో రాష్ట్ర స్థాయి బండలాగుడు పోటీలు

మహానంది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహానంది క్షేత్రంలో ఈ ఏడాది ఫిబ్రవరిలో జరిగే మహానంది మహాశివరాత్రి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మండల టీడీపీ రైతు కమిటీ ఆధ్వర్యంలో నిర్వహించే రాష్ట్ర స్థాయి ఎద్దుల బల ప్రదర్శన పోటీలను దిగ్విజయంగా నిర్వహిస్తామని టీడీపీ క్లస్టర్ ఇన్‌చార్జి నరాల చంద్ర మౌళీశ్వరరెడ్డి తెలిపారు. సోమవారం మహానంది సమీపంలో బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిర్వహించే రాష్ట్ర స్థాయి బండలాగుడు క్రీడా మైదానాన్ని మండల టీడీపీ రైతు కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. ఈపోటీలు ఫిబ్రవరి 27 నుంచి నిర్వహిస్తామన్నారు. వీరివెంట మం డల టీడీపీ అధ్యక్షుడు ఉల్లి మధు, టీడీపీ నాయకులు కిలార్ వెంకటేశ్వర్లు, మారెడ్డి సుబ్రమణ్యం, రమణగౌడ్‌తో పాటు మహానంది దేవస్థానం మాజీ ధర్మకర్త గంగిశెట్టి మల్లిఖార్జునరావు పాల్గొన్నారు.

మహానందిలో పులివెందుల వ్యవసాయ విద్యార్థులు



మహానంది ఆలయం ముందు వ్యవసాయ విద్యార్థులు

మహానంది, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మహానంది ఆలయంలో సోమవారం వైఎస్ఆర్ కడప జిల్లా పులివెందుల ఆచార్య ఎన్‌జిరంగా వ్యవసాయ కళాశాలకు చెందిన 70 మంది విద్యార్థులు దర్శించుకొన్నారు. వ్యవసాయ విద్య ద్వితీయ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు మహానంది ప్రధాన ఆలయాల్లో పూజలు నిర్వహించిన అనంతరం సమీపంలోని వ్యవసాయ కళాశాలతో పాటు పొలాలను సందర్శించారు. ఇక్కడి విద్యార్థులు కోర్సులో భాగంగా సాగు చేస్తున్న విధానంపై తెలుసుకున్నారు.

●మహానంది క్షేత్రంలో సోమవారం రాత్రి ఆలయ వేదపండితులు ఘనంగా పల్లకి సేవను నిర్వహించారు. ఆలయంలో స్వామి, అమ్మవార్లకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కల్యాణ మంటపంలో స్వామి, అమ్మవార్ల ఉత్సవమూర్తుల విగ్రహాలను ప్రత్యేకంగా పూలతో అలంకరించిన పల్లకిలో ఊరేగించారు.

● మహానంది క్షేత్రంలోని రాతి నందీశ్వరుడికి వేదపండితులు ఘనంగా నందీశ్వర అభిషేకాన్ని నిర్వహించారు. పీఠార్చన, ద్రవ్యపూజాతో పాటు అంగపూజ, పంచామృతం, వివిధ రకాల సుగంధ ద్రవ్యాలతో అభిషేకాలను నిర్వహించారు. కార్యక్రమంలో ఆలయ వేదపండితులు చండూరి రవిశంకర్ అవధాని, సహాయ అర్చకులు ధర్మతేజ, మామిళ్ళపల్లి రఘుశర్మలతో పాటు భక్తులు పాల్గొన్నారు.

బిళ్లలాపురంలో అగ్ని ప్రమాదం

నంద్యాల రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): నంద్యాల మండల పరిధిలోని బిళ్లలాపురం గ్రామంలో సోమవారం తెల్లవారు జామున అగ్ని ప్రమాదం చోటు చేసుకుంది. ఈ ప్రమాదంలో గ్రామానికి చెందిన సంకల సుధాకర్ పశువుల పాక పూర్తిగా దగ్ధమైంది. ప్రమాదాన్ని గమనించిన స్థానికులు పాకలో ఉన్న పశువులను కాపాడారు. కొన్ని పశువులకు గాయాలు కాగా పశువైద్యులు చికిత్స నిర్వహించారు. వేకువ జామున చలి ఎక్కువగా ఉండడంతో చలి మంట వేసుకున్నారు. ప్రమాదవశాత్తు చలిమంట వ్యాప్తిచెంది పశువుల పాకకు అంటుకుంది. ఈఘటనలో సుమారు రెండు లక్షలు మేరకు ఆస్థి నష్టం జరిగినట్లు బాధితుడు ఆవేదన వ్యక్తం చేశాడు.

పర్యావరణాన్ని కాపాడుకోవడం మన బాధ్యత

పాణ్యం, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : పర్యావరణాన్ని కాపాడుకోవడం ప్రతి ఒక్కరి బాధ్యతని ఎన్జీసీ స్టేట్ డైరెక్టర్ స్రవంతి అన్నారు. పర్యావరణ విద్య కార్యక్రమంలో భాగంగా బలపనూరు గిరిజన గురుకుల పాఠశాల, కేశవరెడ్డి పాఠశాలల్లో విద్యార్థులకు పర్యావరణ అంశాలైన గాలి, నీరు, భూమి, ఆహారం, శక్తి, వ్యర్థాల గురించి అవగాహన కల్పించారు. ప్లాస్టిక్ వ్యర్థాలు భూమి మీద ఎక్కువ వాడకుండా భూమిని ఆరోగ్యవంతంగా ఉంచుటకు ప్రతి విద్యార్థి కృషి చేయాలన్నారు. కార్యక్రమంలో స్టేట్ ప్రాజెక్ట్ ఆఫీసర్స్ సత్యనారాయణ, ప్రసాద్, మండల విద్యాశాఖాధికారి పాల్గొన్నారు.

హెల్మెట్ ధరించండి: ఎస్ఐ

పాములపాడు జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ప్రతి వాహనదారుడు హెల్మెట్ తప్పనిసరిగా ధరించాలని ఎస్ఐ సురేష్‌కుమార్ అన్నారు. సోమవారం పాములపాడులో భద్రతా వారోత్సవాల సందర్భంగా బైక్ ర్యాలీ నిర్వహించారు. సోమవారం ఆయన స్థానిక బస్టాండు కూడలిలో మాట్లాడుతూ ప్రజలంతా రహదారి సూత్రాలను పాటించాలని, ద్విచక్ర వాహన దారులు హెల్మెంట్, కారు వాహనదారులు సీటుబెల్టు ధరించాలని, సెల్‌ఫోన్ మాట్లాడుతూ డ్రైవింగ్ చేయరాదని, మద్యం సేవించి వాహనాలు నడపరాదని సూచించారు.

సీపీఎం సభలను జయప్రదం చేయండి

ఆత్మకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నెల్లూరులో ఫిబ్రవరి 1,2,3 తేదీల్లో జరగనున్న సీపీఎం 27వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని నాయకులు రణధీర్, సురేంద్ర, మాబా, ఇస్మాయిల్ అన్నారు. సోమవారం స్థానిక ఆ పార్టీ కార్యాలయంలో కార్యక్రమ గోడపత్రికలను ఆవిష్కరించారు. అనంతరం వారు మాట్లాడుతూ.. యువత రాజకీయాల్లోకి రావాలని, అవినీతి, అక్రమాలకు చోటు లేకుండా దేశ భవితను మార్చేలా సభలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

వేలం పాటలో పెరిగిన ఆదాయం

గడివేముల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని గడిగరేవుల గ్రామ సమీపంలో ఉన్న దుర్గాభోగేశ్వర ఆలయంలో శివరాత్రి సందర్భంగా అంగళ్లు నిర్వహించుకునేందుకు సోమవారం ఆలయ పర్యవేక్షణాధికారి వేణునాథరెడ్డి ఆధ్వర్యంలో వేలం పాటలు నిర్వహించారు. ఐస్, కూల్‌డ్రింక్స్ అంగడికి రూ.31 వేలు, చెరుకుల అంగడికి రూ.28,500, కలింగర అంగడికి రూ.15,500, సప్లయర్స్ సామాను అంగడికి రూ.2.80 లక్షలతో వేలం పాట పాడారని అన్నారు. గత ఏడాదితో పోలిస్తే ఈ ఏడాది రూ.1.28 లక్షలు అదనపు ఆదా యం వచ్చిందని ఆలయ కార్యనిర్వాహణాధికారి వీఎల్ఎన్ రామానుజన్ తెలిపారు. కార్యక్రమంలో ఆలయ ప్రధాన అర్చకులు శ్యామ్‌సుందర్‌శర్మ, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

మున్సిపాలిటీలో కలిపినా అభివృద్ధి అంతంతే..!

నంద్యాల జనవరి 27, (ఆంధ్రజ్యోతి): ఆ కాలనీలు నాడు నంద్యాల నగరానికి శివారులో ఉండేవి. నేడు మున్సిపాలిటీలో కలిసినా అభివృద్ధికి అమడ దూరంలో ఉన్నాయి. 1993లో టీడీపీ అధికారంలో ఉండగా.. అప్పటి మంత్రి, ప్రస్తుత మంత్రి ఎన్ఎండీ ఫరూక్ నేతృత్వంలో నిరుపేదలకు పట్టాలిచ్చి నందమూరినగర్ కాలనీగా ఏర్పాటు చేశారు. ఆ తర్వాత 2004లో వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వంలో శిల్పామోహన్ రెడ్డి అదే కాలనీ సమీపంలో వైఎస్ఆర్ కాలనీ ఏర్పాటు చేశారు. ఇదే తరహాలో గతంలోనే ఎస్ఆర్‌బీసీ ప్రాజెక్టుకు చెందిన ఉద్యోగులకు ఎస్ఆర్‌బీసీ కాలనీలో 2014 టీడీపీ అధికారంలో ఉండగా అప్పటి ఎమ్మెల్యే భూమా బ్రహ్మానందరెడ్డి ఎస్ఆర్‌బీసీ కాలనీలో టిడ్కో ఇళ్లను నిర్మించారు. మొత్తంగా రెండు ధఫాలుగా అధికారంలో ఉన్న టీడీపీ హయాంలో రెండు కాలనీలు.. కాంగ్రెస్ హయాంలో ఒక కాలనీ ఏర్పాటైన ట్లైంది.



- నాడు శివారు కాలనీలు...నేడు మున్సిపాలిటీలో విలీనం..
- మూడు కాలనీలు.. రెండు వార్డులుగా విభజన
- టీడీపీ హయాంలో రెండు.. కాంగ్రెస్ హయాంలో మరొక కాలనీ ఏర్పాటు
- మున్సిపాలిటీలో కలిపినా కనిపించని అభివృద్ధి
- నేడు 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండగా' నిర్వహణ
- హాజరుకానున్న మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కమిషనర్



అభివృద్ధికి నోచుకోని నందమూరి కాలనీ

● ఆ కాలనీలు విలీనం...

మొదట నందమూరినగర్, ఎస్ఆర్‌బీసీ కాలనీలు నంద్యాల మున్సిపాలిటీలోని ఓ వార్డులో ఉండేవి. అయితే 2004లో కాంగ్రెస్ హయాంలో వైఎస్ఆర్‌కాలనీ ఏర్పాటు చేయడంతో పాటు ఈ మూడు కాలనీలను కలిపి రెండు వార్డులుగా విభజించి విలీనం చేశారు. వైఎస్ఆర్‌నగర్, నగరంలోని మరొక కాలనీ కలిపి 37వ వార్డుగా.. నందమూరినగర్, ఎస్ఆర్‌బీసీ కాలనీ కలిపి 38వ వార్డుగా ఏర్పాటు చేశారు. అప్పటి నుంచి ఈ మూడు కాలనీలు మున్సిపాలిటీలో ఉన్నప్ప టికి అభివృద్ధి అంతంతగా ఉంది. ప్రతి ఏడాది నిబంధనలు ప్రకారం పన్నులు చెలిస్తున్నా అభివృద్ధి మాత్రం జరగడం లేదని బాధిత ప్రజల ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇదిలా ఉండగా.. ప్రధానంగా డ్రైనేజీలు, రోడ్లు, తాగునీటి, విద్యుత్ దీపాలు తదితర సమస్యలు వేధిస్తున్నాయి. అధికారులను ప్రజాప్రతినిధులను అనేక సార్లు సమస్యలు తీర్చాలని కోరుతున్నా పట్టించుకున్న దాఖలాలు లేవని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ నేపథ్యంలో జనం గొంతుకుగా ఆంధ్రజ్యోతి 'అక్షరం అండగా.. పరిష్కారమే అజెండగా'గా కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. మంగళవారం 38వ వార్డులోని నందమూరినగర్ పరిధిలోని పార్కు సమీపంలో చర్చావేదిక కార్యక్రమం నిర్వహిస్తున్నాం. ఈ కార్యక్రమానికి మంత్రి ఎన్ఎండీ ఫరూక్, కమిషనర్ నిరంజన్‌రెడ్డి హాజరవుతున్నారు. దీంతో ఆయా కాలనీవాసులు తమ సమస్యలు చెప్పుకోవడానికి ఓ వేదిక కానుంది.

● ఆయా కాలనీలోని వివరాలు ఇలా...

వార్డులు	: 37,38
కుటుంబాలు	: 4267
జనాభా సంఖ్య	: 22645
కాలనీలు	: నందమూరినగర్, ఎస్ఆర్‌బీసీ కాలనీలు, వైఎస్ఆర్‌నగర్

అక్షరం అండగా.. పరిష్కారమే అజెండాగా..
ఆంధ్రజ్యోతి ABN



అధ్వానంగా డ్రైనేజీ



కంకర వేశారు.. తారు వేయలేదు..

పారిశ్రామిక వాడగా మార్చేందుకు తండ్రీ కొడుకుల కృషి

ఎమ్మెల్యే గిత్తా జయసూర్య



మాట్లాడుతున్న ఎమ్మెల్యే గిత్తా జయసూర్య

నందికొట్కూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రాష్ట్రాన్ని పారిశ్రామిక వాడగా తయారు చేసేందుకు తండ్రి కొడుకులు సీఎం చంద్రబాబునాయుడు, మంత్రి లోకేశ్ దావోస్ పర్యటను దిగ్విజయం చేశారని నందికొట్కూరు ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. సోమవారం నందికొట్కూరు టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే మాట్లాడుతూ ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ప్రభుత్వం 7 నెలల్లోనే రూ.5 లక్షల కోట్లను పెట్టుబడులుగా పెట్టేందుకు అనేక పరిశ్రమలు వచ్చాయని ఇది ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్ ప్రతిభేనని అన్నారు. అన్ని రాష్ట్రాల ప్రతినిధులు తమ రాష్ట్రాల శ్రేయస్సు కోసం పోటీ పడితే చంద్రబాబు నాయుడు మాత్రం రాష్ట్రం కోసమే కాకుండా యావత్ దేశం తరపునే దావోస్‌లో నాయకత్వం వహించారన్నారు. ప్రపంచంలోనే అత్యంత తలసరి ఆదాయం గల దేశాల్లో భారతదేశం అగ్రగామిగా నిలపాలని పిలుపునివ్వడంతో పాటు తెలుగువాడి ప్రతిభను మరోసారి పరిచయం చేసేందుకు కంకణం కట్టుకున్నారన్నారు. ఒక్క జూమ్ కాల్‌తోనే ఆర్సెలార్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్ కంపెనీతో మాట్లాడి రాష్ట్రానికి రూ.1.46 లక్షల కోట్ల పెట్టుబడులను తీసుకువచ్చిన ఘనత ఐటీ శాఖామంత్రి నారా లోకేశ్‌కే దక్కుతుందన్నారు. జనవరి 8న విశాఖలో రూ.2 లక్షల కోట్ల ప్రాజెక్టులకు ప్రధాని మోదీ శంకుస్థాపనలు చేశారన్నారు. ఇలా ఈ ఐదేళ్లలో టీసీఎస్, బీపీసీఎల్, రిలైన్స్, గ్రీన్‌కో, ఆర్సెలార్ మిట్టల్ అండ్ నిప్పాన్ స్టీల్, పీపుల్ టెక్ వంటి ఎన్నో పరిశ్రమలు ఇప్పటికే రాష్ట్రం లో పెట్టుబడులు పెట్టబోతున్నాయన్నారు. టీడీపీ ఐదేళ్లలో రాష్ట్రాన్ని ఒక పారిశ్రామిక వాడగా తీర్చిదిద్దేందుకు కూటమి ప్రయత్నం చేస్తోందన్నారు.

● **చరిత్ర పుటల్లో యువగళం పాదయాత్ర**

రాష్ట్ర ప్రజలు రాక్షసుడి వికృత చేష్టలపై గళం విప్పేందుకు, ప్రజలను చైతన్య పరిచేందుకు నాడు నారా లోకేశ్ చేపట్టిన యువగళం పాదయాత్ర చరిత్ర పుటల్లో నిలిచిందని ఎమ్మెల్యే గిత్తా జయసూర్య అన్నారు. నారా లోకేశ్ యువగళం పాదయాత్ర ప్రారంభమై నేటికి రెండు సంవత్సరాలు పూర్తి అయిన సందర్భంగా పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే గిత్తా జయసూర్య, పట్టణాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, ఇతర టీడీపీ నాయకులు కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో యాదవ కార్పొరేషన్ డైరెక్టర్ తూడిచర్ల వెంకటేశ్వర్లు యాదవ్, టీడీపీ పట్టణాధ్యక్షులు భాస్కర్‌రెడ్డి, టీడీపీ నాయకులు మాండ్ర సురేంద్రనాథ్‌రెడ్డి, కౌన్సిలర్ జాకీర్, షకీల్ అహ్మద్, ముర్తుజావళి, పలుచాని మహేశ్వరరెడ్డి, వేణుగోపాల్, మల్లికార్జునరెడ్డి, ఆయిల్ రవి, మీనాక్షి, డా.వనజ తదితరులు పాల్గొన్నారు.



ఆత్మకూరులో కేక్ కట్ చేస్తున్న నాయకులు

ఆత్మకూరు: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి, రాష్ట్ర మంత్రి నారాలోకేష్ తలపెట్టిన యువగళం స్ఫూర్తితోనే రాష్ట్రంలో వైసీపీ రాక్షస పాలనకు విముక్తి కలిగించిందని శ్రీశైలం దేవస్థానం ట్రస్టుబోర్డు మాజీ చైర్మన్ వంగాల శివరామిరెడ్డి, టీడీపీ మండలాధ్యక్షులు పేర్కొన్నారు. సోమవారం యువగళం పూర్తయి రెండేళ్లు ముగిసిన సందర్భంగా గౌడ్ సెంటర్‌లో టీడీపీ శ్రేణులు కేక్ కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు. కార్యక్రమంలో కూటమి పార్టీ నాయకులు అబ్దుల్లాపురం బాషా, వెంకటేశ్వర్లు, గౌస్, రామనర్సయ్య, టీ.ముర్తుజా, శివశంకరశర్మ, బీజేపీ, జనసేన నాయకులు సుదర్శన్, శ్రీరాములు తదితరులు ఉన్నారు.

శ్మశాన వాటికలో ముళ్ల చెట్ల తొలగింపు

బండిఆత్మకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎ.కోడూరు గ్రామ శ్మశాన వాటికలో ముళ్ల చెట్లు తొలగించారు. మాజీ సర్పంచ్ వడ్డు వెంకటసుబ్బారెడ్డి కుమారుడు, టీడీపీ నాయకుడు వడ్డు మధుసదన్‌రెడ్డి, ఆరో వార్డు సభ్యురాలు వెంకటలక్ష్మమ్మ కుమారుడు మధు విజయ్‌భాస్కర్‌రెడ్డి తమ సొంత డబ్బులతో సోమవారం ముళ్ల చెట్లు తొలగించి, చదును పనులు చేయించారు. శ్మశానవాటిక చుట్టూ ప్రహరీ నిర్మాణానికి కృషి చేస్తానని మధుసూదన్‌రెడ్డి తెలిపారు.

కృష్ణా నది యాజమాన్యం బోర్డు కర్నూలులో పెట్టాలి

గడివేముల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గడివేముల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కృష్ణానది యాజమాన్యం బోర్డు కార్యాలయాన్ని కర్నూలులోనే ఏర్పాటు చేయాలని రాయలసీమ సాగునీటి సాధన సమితి నాయకులు ఈశ్వర్‌రెడ్డి, టీడీపీ మండల అధ్యక్షుడు సత్యనారాయణరెడ్డి అన్నారు. సోమవారం తహసీల్దార్ వెంకటరమణకు వినతి పత్రం అందజేశారు. వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం గత ప్రభుత్వ నిర్ణయాన్ని పునఃపరిశీలించి కృష్ణాబోర్డును కర్నూలులోనే ఏర్పాటు చేయాలని అన్నారు. కార్యకమంలో మాజీ జడ్పీటీసీ సీతారామిరెడ్డి, నీటి సంఘం అధ్యక్షుడు పంట రామచంద్రారెడ్డి, టీడీపీ నాయకులు మాజీ కో-ఆప్షన్‌మెంబర్ ఎస్‌పి రఫిక్, నరసింహారెడ్డి, వడ్డు లక్ష్మీదేవి, రామ్మోహన్‌రెడ్డి, శ్రీనివాసయాదవ్, సంజీవరెడ్డి, రమణారెడ్డి, మాజీ సర్పంచ్ జమాల్‌బాష తదితరులు పాల్గొన్నారు.

మరో మూడు మద్యం దుకాణాలు

నందికొట్కూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో మరో మూడు మద్యం దుకాణాలను కేటాయిస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసినట్లు ఆశాఖ ఎస్ఐ జఫ్రూల్లా తెలిపారు. సోమవారం ఆయన మాట్లాడుతూ నందికొట్కూరు ప్రొహిబిషన్, ఎక్సైజ్‌శాఖ స్టేషన్ పరిధిలోని ఈడిగ, గౌడ, గౌడు కులస్థులకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మూడు మద్యం షాపులను కేటాయించిందన్నారు. ఈడిగ కులస్తులకు నందికొట్కూరు పట్టణం, జూపాడుబంగ్లా మండలంలో ఒక్కొక్క మద్యం షాపు, గౌడ కులస్తులకు పగిడ్యాల మండలంలో ఒక దుకాణం మంజూరైనట్లు ఆయన తెలిపారు. ఈ దుకాణాలకు ఆయా మండలాల తహసీల్దార్ వద్ద కుల ధృవీకరణ పత్రాలను తీసుకొని దరఖాస్తుతో పాటు జతచేయాలన్నారు. ఈనెల 28 నుంచి ఫిబ్రవరి 5వ తేదీ సాయంత్రం 5 గంటల వరకు దరఖాస్తులను స్వీకరిస్తారన్నారు. దరఖాస్తు రుసుము రూ.2 లక్షలు నంద్యాల జిల్లా ప్రొహిబిషన్ ఎక్సైజ్ ఆఫీసర్ పేరుతో డీడీ తీయాలని ఆయన తెలిపారు.

ఆత్మకూరు: ఆత్మకూరు ఎక్సైజ్ స్టేషన్ పరిధిలో గీత కులాలకు ప్రభుత్వం మూడు మద్యం దుకాణాలను కేటాయించినట్లు ఎక్సైజ్ సీఐ కిశోర్‌కుమార్ తెలిపారు. సోమవారం స్థానిక ఎక్సైజ్ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ఆత్మకూరు అర్బన్, కొత్తపల్లి, పాములపాడు మండలాలకు ఒక్కో దుకాణం చొప్పున మొత్తం మూడు దుకాణాలను కేటాయించినట్లు తెలిపారు. ఇందులో ఆత్మకూరు, కొత్తపల్లి గౌడ కులానికి కాగా, పాములపాడు ఈడిగ కులానికి కేటాయించినట్లు వివరించారు. కాగా ఈ నెల 28 నుంచి ఫిబ్రవరి 5వ తేది సాయంత్రం 5గంటల వరకు దుకాణాలకు దరఖాస్తులు స్వీకరించనున్నట్లు చెప్పారు. 6వ తేదిన దరఖాస్తులను పరిశీలించి 7వ తేదిన లాటరీ ద్వారా ఎంపిక చేయనున్నట్లు వివరించారు. కాగా ఒక్కో దరఖాస్తుకు రూ.2లక్షల నాన్‌రీఫండబుల్ అమౌంట్‌ను ఆన్‌లైన్ చలానా, లేదా డీడీ రూపంలో చెల్లించాల్సి ఉంటుందని అన్నారు. మరిన్ని వివరాలకు 9440902585లను సంప్రదించాలన్నారు.

మినుము పంటకు నష్టపరిహారం చెల్లించాలి

నందికొట్కూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): రబీలో సాగు చేసిన మినుము పంటకు రూ.30 వేలు నష్టపరిహారం చెల్లించడంతో పాటు, రూ.10 వేలు మద్దతు ధర ప్రకటించాలని రాష్ట్రప్రభుత్వాన్ని అఖిల భారత కిసాన్ మహాసభ జిల్లా నాయకులు పిక్కిలి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. సోమవారం నందికొట్కూరు పట్టణ శివారులోని మినుము పంటను అఖిల భారత కిసాన్ మహాసభ నాయకులు పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ రైతులు ఖరీఫ్ సీజన్‌లో మొక్కజొన్న, పత్తి, కంది, మిరప, ఉల్లి, పొగాకు తదితర పంటలు వేసి అతి వృష్టి వల్ల తీవ్రంగా నష్టపోయారన్నారు. రబీ సీజన్‌లో రెండో పట మినుము పంటను వేశారని, అయితే ప్రతికూల వాతావరణ పరిస్థితుల వల్ల పూత నిలబడడం లేదన్నారు. నష్టపోయిన పంటలను గుర్తించి నష్టపరిహారం ఇవ్వాలన్నారు. కార్యక్రమంలో అఖిల భారత కిసాన్ మహాసభ, రైతు సంఘం నాయకులు వేల్పుల ఏసన్న సధాకర్, శాలుమియా, కార్మిక సంఘం, ఏఐటీయూసీ నాయకులు చెరుకుచెర్ల సుగరాజు, సుధాకర్, మండల నాయకులు రామకృష్ణ, రమేష్ పాల్గొన్నారు.

మందకృష్ణకు పద్మశ్రీ అవార్డు ప్రకటించడం హర్షణీయం

ఆత్మకూరు, జనవరి 27(ఆంధ్రజ్యోతి): ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపకుడు మందకృష్ణ మాదిగ పోరాట స్ఫూర్తిని గుర్తిస్తూ కేంద్ర ప్రభుత్వం ఆయనకు పద్మశ్రీ ఇవ్వడం హర్షణీయమని ఎమ్మార్పీఎస్ నాయకులు రాబిన్‌సన్, దరగయ్య, నాగశేషులు పేర్కొన్నారు. సోమవారం ఆత్మకూరులో వారు మాట్లాడుతూ.. 30 ఏళ్లుగా మాదిగ, వాటి ఉపకులాలకు ఎస్సీ వర్గీకరణ కోసం ఆయన చేసిన పోరాటం స్ఫూర్తిదాయకమని అన్నారు.

బండిఆత్మకూరు: మాదిగ రిజర్వేషన్ పోరాట వ్యవస్థాపకులు మంద కృష్ణకు ప్రభుత్వం పద్మశ్రీ అవార్డుతో సత్కరించడంతో స్థానిక ఎంఆర్పీఎస్ నాయకులు సంబరాలు చేసుకున్నారు. సోమవారం బండిఆత్మకూరు బస్టాండ్‌లో వెంకటసుబ్బన్న ఆధ్వర్యంలో కేక్ కట్ చేశారు. కార్యక్రమంలో శివకుమార్, దశరథుడు, బాబురావు, చిట్టిన్న, సురేష్ పాల్గొన్నారు.

వాహనదారుల ఆందోళన

- పాత పద్ధతిలో ఫిట్‌నెస్ కోసం స్లాట్ బుక్ చేసుకున్న వాహనదారులు
- ఏటీఎస్ సెంటర్‌ను ఆశ్రయించాలనడంతో ఆందోళనకు దిగిన వాహనాల యజమానులు
- పోలీసుల జోక్యంతో సద్దుమణిగిన వివాదం



రహదారిపై నిలిచిపోయిన వాహనాలు



ఆర్టీవో కార్యాలయం వద్ద రహదారిపై రాస్తారోకో చేస్తున్న వాహనదారులు

నంద్యాల క్రైం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఫిట్‌నెస్ టెస్ట్ కోసం వచ్చిన వాహనదారులకు టెస్ట్ చేయకుండా నిరాకరించడంతో సహనం కోల్పోయి జాతీయ రహదారిపై రాస్తారోకోకు దిగిన సంఘటన నంద్యాల ఆర్టీవో కార్యాలయం వద్ద సోమవారం చోటు చేసుకుంది. ఆటోమేటిక్ టెస్టింగ్ సెంటర్ (ఏటీఎస్)ను ప్రభుత్వం ఈ నెల 25న ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రారంభించిందని ఆర్టీవో కార్యాలయ వర్గాలు తెలిపాయి. వాహనదారులు ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం ఏటీఎస్ సెంటర్ల వద్దనే వాహనాల ఫిట్‌నెస్‌కు సంబంధించిన ప్రక్రియ పూర్తిచేయించుకోవాలని అధికార వర్గాలు పేర్కొంటున్నాయి. విషయం తెలియని వాహనదారులు ఫిట్‌నెస్ కోసం చలానాలు గతంలో మాదిరే ఆర్టీవో కార్యాలయంలో చెల్లించి స్లాట్ బుక్ చేసుకొని సోమవారం తమ వాహనాలతో ఆర్టీవో కార్యాలయం చేరుకున్నారు. ఉదయం నుంచి సాయంత్రం వరకు అధికారుల నుంచి ఫిట్‌నెస్ ప్రక్రియ జరగకపోవడంతో వాహనదారులంతా అధికారులు, సిబ్బందిని ఇదే విషయమై ప్రశ్నించారు. సిబ్బంది మాత్రం నింపాదిగా ఏటీఎస్ సెంటర్ల వద్దనే మీరంతా స్లాట్ బుక్ చేసుకోవాలని, అలా చేసుకున్న వారికి వరుస క్రమంలో చాబోలు రోడ్డులో ఉన్న ఏటీఎస్ సెంటర్‌లోనే టెస్టింగ్ నిర్వహిస్తారని పేర్కొన్నారు. ఉదయం నుంచి ఎండలో పడిగాపులు పడుతున్నా ఈ విషయం ఎందుకు మీరు తెలియజేయలేదని, అలా చెప్పి ఉంటే ఏటీఎస్ సెంటర్‌లోనే ప్రక్రియ పూర్తి చేసుకునేవారం కదా అని వాహనదారులు అసహనం వ్యక్తం చేశారు. వాహనదారులంతా తమ వాహనాలను జాతీయ రహదారిపై అడ్డంగా పెట్టి రాస్తారోకో చేపట్టారు. ఆర్టీవో కార్యాలయ అధికారు లు, సిబ్బంది వారికి ఎంత నచ్చచెప్పినా వినకపోవడంతో రహదారిపై దాదాపు కిలోమీటర్ మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్ స్తంభించిపోయింది.

● రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తా: డీటీవో



రెండు రోజుల్లో సమస్య పరిష్కారానికి కృషి చేస్తానని జిల్లా రవాణా శాఖ అధికారి వై.ఐశ్వర్యా రెడ్డి పేర్కొన్నారు. వాహనాల ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకునేందుకు ప్రైవేట్ భాగస్వామ్యంలో ప్రభుత్వం ఏటీఎస్ కేంద్రాన్ని ఈ నెల 25న ప్రారంభించిందన్నారు. వాహనదారులంతా ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం స్లాట్ బుక్ చేసుకోవాల్సి ఉంటుందన్నారు. అయితే గత కొంతకాలంగా వాహనదారులు ఈ విషయం గమనించకుండా పాత పద్ధతిలోనే ఆర్టీవో కార్యాలయంలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్ కోసం తమ కార్యాలయంలోనే స్లాట్ బుక్ చేసుకుంటున్నారని పేర్కొన్నారు. మారిన పరిస్థితుల దృష్ట్యా పాత పద్ధతిలో స్లాట్ బుక్ చేసుకుంటే చెల్లుబాటు కాదని, ఇదే విషయాన్ని వాహనదారులకు తెలియజేశామని అన్నారు. ఇప్పటి వరకు స్లాట్ బుక్‌చేసుకున్న వారందరి విషయం ఉన్నతాధికారులతో చర్చించి రెండురోజుల్లో సమస్యను పరిష్కరిస్తామని పేర్కొన్నారు.

డోన్

డోన్, ఆళ్లగడ్డ, బనగానపల్లె

గర్భిణుల కోసమే కిల్‌కారి ఆరోగ్య సేవలు



సమావేశంలో మాట్లాడుతున్న రాయలసీమ రీజినల్ అధికారి కీర్తి

చాగలమర్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం గర్భిణుల కోసం కిల్‌కారి ఆరోగ్య సేవలను అందిస్తోందని రాయలసీమ రీజినల్ అధికారి కీర్తి అన్నారు. సోమవారం చాగలమర్రి ప్రభుత్వ వైద్యశాలలో ఎంఎల్‌హెచ్‌పీ, ఏఎన్ఎం, ఆశా వర్కర్లకు కేంద్ర ప్రభుత్వం ప్రవేశ పెట్టిన కిల్‌కారి ఆరోగ్య సేవలపై అవగాహన కల్పించారు. గర్భిణి నాలుగవ నెల నుంచి మొబైల్ అకడమి ద్వారా సూచనలు, సలహాలు అందించనున్నట్లు తెలిపారు. నాలుగవ నెల నుంచి తొమ్మిదవ నెల వరకు ఏ విధమైన జాగ్రత్తలు తీసుకోవాలో ఆరోగ్య కార్యకర్తలు, ఆశాలు తెలియజేయాలని సూచించారు. కార్యక్రమంలో వైద్యులు ఇమ్రాన్, అంజలి, సీహెచ్‌వో రమణమ్మ, హెచ్ఈ వెంకటమ్మ, సూపర్ వైజర్ రామలింగారెడ్డి, సీతారాములు పాల్గొన్నారు.

సద్వినియోగం చేసుకోవాలి

ప్యాపిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కందుల కొనుగోలు కేంద్రాన్ని సద్వినియోగం చేసుకోవాలని మాజీ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకుడు టి శ్రీనివాసులు అన్నారు. సోమవారం పట్టణంలో కందుల కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా శ్రీనివాసులు మాట్లాడుతూ కొనుగోలు కేంద్రంలో కందులకు గిట్టుబాటు ధర కల్పిస్తున్నట్లు తెలిపారు. అలాగే తూకాల్లో ఎటువంటి అక్రమాలు జరగకుండా అధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటారన్నారు. రైతులు తమ కంది దిగుబడులను కొనుగోలు కేంద్రలో విక్రయించాలని సూచించారు. కార్యక్రమంలో డీసీఎంఎస్ మేనేజర్ శరణ్య, రైతులు పాల్గొన్నారు.

'దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు ఇవ్వాలి'

కొలిమిగుండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఎన్నికల ముందు ఇచ్చిన హామీ మేరకు దివ్యాంగులకు ఇళ్ల స్థలాలు కేటాయించాలని ఆ సంఘం నాయకులు శ్రీనివాసులు, మద్దిలేటి కోరారు. సోమవారం కొలిమిగుండ్ల తహసీల్దార్ కార్యాలయంలో తహసీల్దార్ బాలీశ్వరరెడ్డిని కలిసి, దివ్యాంగులు తమ సమస్యలను పరిష్కరించాలని కోరారు. దీంతో ఆయన సూచనమేరకు రెవెన్యూ సిబ్బందికి దివ్యాంగులు వినతిపత్రం సమర్పించారు.

నేడు ఉచిత కంటి వైద్య శిబిరం

కొలిమిగుండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రంలోని పాత తహసీల్దారు కార్యాలయ ఆవరణలో మంగళవారం కంటి వైద్య శిబిరాన్ని నిర్వహించనున్నట్లు ఐ మిత్ర కంటి ఆసుపత్రి వైద్య సహాయకులు పులిపాటి గోపాల్ వెల్లడించారు. ఈ సందర్భంగా శస్త్ర చికిత్సలు అవసరమైన వారిని గుర్తించి, ఉచితంగా ప్రత్యేక బస్సులో కడప పుష్పగిరి ఆసుపత్రితో చేయిస్తామన్నారు. గ్రామాల ప్రజలు కంటి వైద్య శిబిరాన్ని ఉపయోగించుకోవాలని గోపాల్ కోరారు.

దరఖాస్తుల స్వీకరణ

ఆళ్లగడ్డ(శిరివెళ్ల), జనవరి 27(ఆంధ్రజ్యోతి) : కల్లుగీత కులాల కోసం ప్రభుత్వం కేటాయించిన ప్రైవేట్ మద్యం దుకాణం ఏర్పాటు చేసుకునేందుకు దరఖాస్తులు స్వీకరిస్తున్నట్లు ఆళ్లగడ్డ ప్రొహిబిషన్, ఎక్సైజ్ శాఖ సీఐ రవి కుమార్ సోమవారం తెలిపారు. ఆళ్లగడ్డ మున్సిపాలిటీ పరిధిలో ఒక మద్యం దుకాణాన్ని ప్రభుత్వం గౌడ్ కులాల వారికి కేటాయించినట్లు ఆయన తెలిపారు. ఆసక్తి, అర్హత కలిగిన గౌడ్ కులాలకు చెందిన వ్యక్తులు ఈ నెల 28వ తేదీ నుంచి ఫిబ్రవరి 5వ తేదీ వరకు ఆళ్లగడ్డ ప్రొహిబిషన్, ఎక్సైజ్ కార్యాలయంలో ఆన్‌లైన్ మరియు ఆఫ్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవచ్చని సూచించారు. ఫిబ్రవరి 7న కలెక్టర్ ఆధ్వర్యంలో లాటరీ పద్ధతి ద్వారా దుకాణాన్ని కేటాయించనున్నట్లు తెలిపారు.

ప్రజల ఆరోగ్యం కోసమే ప్లాస్టిక్ నివారణ

బనగానపల్లె, అక్టోబరు 27(ఆంధ్రజ్యోతి): ప్రజల ఆరోగ్యం కోసమే టీడీపీ నాయకురాలు బీసీ ఇందిరమ్మ ఆధ్వర్యంలో ప్లాస్టిక్ నివారణకు పూనుకున్నట్లు ప్రపంచ ఆర్యవైశ్య మహాసభ జిల్లా అధ్యక్షుడు, టీడీపీ నంద్యాల జిల్లా వాణిజ్య విభాగం అధ్యక్షుడు టంగుటూరు శ్రీనయ్య అన్నారు. సోమవారం పట్టణంలోని మార్కెట్ యార్డు సమీపంలోని మండి మర్చంట్ యూనియన్ కార్యాలయంలో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్లాస్టిక్ నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. సమావేశంలో పట్టణంలోని అన్ని వ్యాపారసంస్థల అధ్యక్షులు, సభ్యులు పాల్గొన్నారు.

'సొంతూరి రుణం తీర్చుకుంటా'

ఉయ్యాలవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : తన సొంత గ్రామమైన కాకరవాడ రుణం తీర్చుకుంటామని కేశవరెడ్డి విద్యాసంస్థల అధినేత కేశవరెడ్డి అన్నారు. సోమవారం కాకరవాడ చేరుకుని ప్రాథమిక పాఠశాలలోని విద్యార్థులకు ఆట వస్తువులు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామంలో పలు అభివృద్ధి కార్యక్రమాలు చేయడానికి సిద్ధంగా ఉన్నామన్నారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రమణ, శ్రీధర్, వీఆర్‌ఏ సునీల్, గ్రామస్థులు ఉన్నారు.

వాహన యజమానుల ఆందోళన

డోన్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): పట్టణం సమీపంలోని జాతీయ రహదారి వద్ద ఉన్న ఆర్టీవో కార్యాలయం వద్ద నియోజకవర్గంలోని పలు గ్రామాలకు చెందిన పలు వాహనదారులు ఆందోళనకు దిగారు. ఫిట్‌నెస్ సర్టిఫికెట్ రెన్యువల్ కోసం వచ్చిన వారు నంద్యాలలో ఫిట్‌నెస్ సర్టిఫికెట్లు రెన్యువల్ చేసుకోవాలని అధికారులు చెప్పడంతో నిరసనకు దిగారు. ఫిట్‌నెస్ రెన్యువల్ కోసం డబ్బులు చెల్లించామని, తిరిగి నంద్యాలలో ఫిట్‌నెస్ చేసుకోవాలంటే అక్కడ తిరిగి డబ్బులు చెల్లించాల్సి ఉంటుందని, వీటి వల్ల నష్టపోతామని పలువురు వాహనదారులు జాతీయ రహదారిపై ఆందోళనకు దిగడంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. దాంతో పట్టణ ఎస్ఐ ఇంతియాజ్ బాషా, ఎస్ఐ శరత్ కుమార్ రెడ్డి సంఘటనా స్థలానికి వచ్చి ఆందోళన కారులను నచ్చజెప్పి ఆందోళనను విరమింపజేశారు. ఆర్టీవో క్రాంతి కుమార్ కూడా ఆందోళన కారులకు ప్రభుత్వం ఇచ్చిన జీవో ప్రకారం నడుచుకోవాలని నచ్చజెప్పారు.

అల్లుకున్న నిర్లక్ష్యం



ట్రాన్స్‌ఫార్మర్‌ను అల్లుకున్న ముళ్ల చెట్టు

చాగలమర్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): ఇళ్ల ముందు కరెంట్ తీగలకు కాసింత ఎత్తులో ఉంటే చాలు చెట్లను తెగనరికే విద్యుత్ అధికారులు ఇదిగో ఈ చిత్రంలో ఉన్న విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, విద్యుత్ తీగలకు అల్లుకపోయిన ముళ్ల కంప తీగలను మాత్రం గాలికొదిలేశారు. చాగలమర్రి గ్రామంలోని దస్తగిరిస్వామి దర్గాకు వెళ్లే రహదారిలో విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్, స్తంభానికి పచ్చని ముళ్లకంపల తీగలు అల్లుకున్నాయి. ఎప్పుడు ప్రమాదం జరుగుతుందోనని సమీప కాలనీలో ఉన్న ప్రజలు ఆందోళన చెందుతున్నారు. సంబంధిత అధికారులు స్పందించి అల్లుకున్న ముళ్లకంప తీగలను తొలగించాలని కాలనీవాసులు కోరుతున్నారు.

రీచార్జి చేస్తేనే వెలుగులు

- విద్యుత్ వాడకానికి రీచార్జి సిస్టం
- వేగవంతంగా సాగుతున్న డిజిటల్ మీటర్ల ఏర్పాటు

కొలిమిగుండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : విద్యుత్ వినియోగదారులందరినీ ప్రీపెయిడ్ మీటర్ల నెట్‌వర్క్‌లోకి తీసుకరావడానికి చకచకా అడుగులు పడుతున్నాయి. కేంద్ర ప్రభుత్వ ఆదేశానుసారం డిజిటల్ మీటర్ల ఏర్పాటు ప్రక్రియ ఇప్పటికే ప్రారంభమయ్యింది. ప్రథమంగా వీధిలైట్లు, తాగునీటి సరఫరా వ్యవస్థకు ఈడిజిటల్(స్మార్ట్ ప్రీపెయిడ్) మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. వీటితో పాటు క్యాటగిరి-2 కిందకు వచ్చే దుకాణాలు, షాపింగ్ మాల్స్‌కు స్మార్ట్ మీటర్లను ఏర్పాటు చేస్తున్నారు. కొలిమిగుండ్ల మండలంలో వీధిలైట్లు, తాగునీటి పథకాల కనెక్షలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు ఇప్పటికే పూర్తిచేశారు. మండలంలో మొత్తం 387 విద్యుత్ సరఫరా స్కీమ్ కనెక్షలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు పూర్తి చేసినట్లు ఏఈ లక్ష్మణ స్వామి వెల్లడించారు. ఇక క్యాటగి రి-2 సంబంధించి దుకాణాలు, ఇతర వ్యాపార సముదాయాలకు స్మార్ట్ మీటర్లు ఏర్పాటు చేస్తున్నారు. మండల వ్యాప్తంగా మొత్తం 892 క్యాట గిరి-2 కనెక్షన్లు ఉన్నాయి. వీటికి రీచార్జి సిస్టం అమలు చేసిన తరువాత మిగిలిన అన్ని గృహ సముదాయాల కనెక్షన్లకు స్మార్ట్ మీటర్ల ఏర్పాటు కొనసాగుతుందని అధికారులు పేర్కొంటున్నారు.



ఓ షాపింగ్ కాంప్లెక్సులో ఏర్పాటు చేసిన స్మార్ట్ మీటర్లు



కొలిమిగుండ్లలో స్మార్ట్ మీటర్ అమర్చుతున్న సిబ్బంది

వినియోగదారుల్లో ఆందోళన

విద్యుత్ వినియోగదారుల్లో మాత్రం స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ఒకింత ఆందోళన వ్యక్తమవుతోంది. ఈవ్యవస్థ ఎలా పని చేస్తుందోనన్న అనుమానాలను సైతం వినియోగదారులు వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికే విద్యుత్ బిల్లులు పెరిగిన నేపథ్యంలో స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో బిల్లులు మరింత పెరుగుతాయన్న ఆవేదన వినియోగదారుల్లో నెలకొంది. స్మార్ట్ మీటర్లు ఏర్పాటు పూర్తయిన వెంటనే మరో ఒకటి, రెండు నెలల్లోనే రీచార్జి సిస్టం అమలులోకి వచ్చే అవకాశం ఉందని విద్యుత్ శాఖ అధికారులు పేర్కొంటున్నారు.

కష్టమైన పని



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుతో విద్యుత్ బిల్లులు ఏవిధంగా ఉంటాయోనని ఆందోళన కలుగుతోంది. ముందే నగదు చెల్లించడం కష్టతరమైన పని. పాలకులు, అధికారులు ఈ విధానాన్ని ఉపసంహరించుకోవాలి.

- విజయ్, కొలిమిగుండ్ల

అవగాహన కల్పించాలి



స్మార్ట్ మీటర్ల ఏర్పాటుపై ముందు ప్రజల్లో అవగాహన కల్పించాలి. ముందే నగదు చెల్లించి, సేవలు పొందితే ప్రభుత్వాలు ఉండి ప్రజలకు ఉపయోగం ఏమిటి? దీనిపై సామాన్య ప్రజల్లో వ్యతిరేకత ఉంది.

- దావీదు, సీపీఎం నాయకులు

కృష్ణదేవరాయల సేవలు మరువలేం



కృష్ణదేవరాయల విగ్రహానికి పూలమాల వేస్తున్న బలిజ సంఘం నాయకులు

ఉయ్యాలవాడ, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : హిందూ దేవాలయాల నిర్మాణంలో కృష్ణదేవరాయలు చేసిన సేవలు మరువలేనివని బలిజ సంఘం గౌరవాధ్యక్షుడు జింకా వెంకటస్వామి అన్నారు. సోమవారం కృష్ణదేవరాయల జయంతి సందర్భంగా ఉయ్యాలవాడ గ్రామంలోని ఆయన విగ్రహానికి బలిజ సంఘం నాయకులు పూలమాల వేసి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ దేశంలోని ఎన్నో దేవాలయాలను కృష్ణదేవరాయలు నిర్మించారన్నారు. అంతే కాకుం డా సేవా గుణంలో కూడా క్రిష్ణదేవరాయలు ఎనలేని సేవలు అందించాడన్నారు. అనంతరం స్వీట్లు పంచుకున్నారు. కార్యక్రమంలో బలిజ సంఘం అధ్యక్షులు ఆకుల నడిపి వెంకటసుబ్బయ్య, సంఘం సెక్రటరీ అచ్చిగారి నరసింహుడు, సాగునీటి సంఘం అధ్యక్షులు చిన్న వెంకట సుబ్బయ్య, బాలసుబ్బయ్య, శ్రీనివాసులు, వెంకటస్వామి పాల్గొన్నారు.

దొర్నిపాడు: మండలంలోని దొర్నిపాడు గ్రామంలో సోమవారం బలిజ సంఘం ఆధ్వర్యంలో శ్రీకృష్ణదేవరాయల జయంతిని ఘనంగా నిర్వహించారు. అంకాలమ్మ గుడి ఆవరణలో ఏర్పాటు చేసిన శ్రీకృష్ణదేవరాయల విగ్రహానికి పాలాభిషేకం చేసి పూలమాల వేసి ప్రత్యే క నివాళులర్పించారు. కార్యక్రమంలో బలిజ సంఘం నాయకులు సిద్ధి సత్యనారాయణ, పగడాల రమేష్‌బాబు, వెంకటేశ్వర్లు, తోట సంజీవరాయుడు, పి.ప్రతాప్, జిల్లా సుబ్బన్న, బాలిరెడ్డి, అంకన్న తదితరులున్నారు.

కోవెలకుంట్ల : శ్రీకృష్ణదేవరాయల పాలన ఓ స్వర్ణ యుగమని కోవెలకుంట్ల బలిజ సంక్షేమ సంఘం గౌరవాధ్యక్షుడు గాజుల ఈశ్వరయ్య అన్నారు. సోమవారం బలిజ సంఘం నాయకులు శ్రీకృష్ణదేవరాయుల జయంతి సందర్భంగా గ్రామ పంచాయతీసర్కిల్ సమీపంలో ఏర్పాటు చేసిన కృష్ణదేవరాయ విగ్రహానికి నివాళి అర్పించారు. కార్యక్రమంలో ఉపాధ్యక్షుడు వెంకటేశ్వర్లు, సెక్రటరీ రమణయ్య, అధ్యక్షులు బాలము రశీక్రిష్ణ, సభ్యులు పాల్గొన్నారు.

చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు: డీఈవో



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందజేస్తున్న డీఈవో జనార్దన్ రెడ్డి

డోన్ రూరల్, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): విద్యార్థులకు చదువుతోనే ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని జిల్లా విద్యాశాఖ అధికారి జనార్దన్ రెడ్డి అన్నారు. సోమవారం పట్టణంలోని ఏపీ మోడల్ స్కూల్‌ను ఆయన తనిఖీ చేశారు. అనంతరం విద్యార్థులను ఉద్దేశించి డీఈవో మాట్లాడారు. క్రీడల్లో, చదువులో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ప్రోత్సాహక బహుమతులు, ప్రశంసాపత్రాలను అందజేశారు. కార్యక్రమంలో కళాశాల ప్రిన్సిపాల్ కేసీ రాజు శ్రీనివాసు, వైస్ ప్రిన్సిపాల్ చంద్రకాంత్ యాదవ్, ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి



శనగ దిగుబడిని పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ

కోవెలకుంట్ల, జనవరి 27 (ఆంధ్ర జ్యోతి) : రైతులు సాగు చేసిన పంటలన్నింటినీ తప్పని సరిగా నమోదు చేసుకోవాలని జిల్లా వ్యవసాయాధికారి మురళీక్రిష్ణ అన్నారు. సోమవారం రేవనూరు గ్రామంలో శెనగపంట పంట కోత ప్రయోగం చేశారు. శనగ దిగుబడి 5.3 జీఎటీఎస్ రికార్డు అయింది. కార్యక్రమంలో కోవెలకుంట్ల వ్యవసాయ సహాయ సంచాలకులు సుధాకర్, ఏవో నిరంజన్, రైతు సేవా కేంద్రం సిబ్బంది, రైతులు పాల్గొన్నారు.

సమస్యలన్నీ పరిష్కరిస్తాం: తహసీల్దారు

సంజామల, జనవరి 27(ఆంధ్రజ్యోతి): మండల స్థాయిలో నెలకొన్న సమస్యలన్నీ స్థానికంగానే పరిష్కరిస్తామని తహసీల్దారు అనిల్ కుమార్, ఎంపీడీవో సాల్మన్ అన్నారు. సోమవారం ప్రజా సమస్యల పరిష్కార వేదిక నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రజల నుంచి వినతులను స్వీకరించారు.

గ్రామాల్లో అందుబాటులో ఉండాలి

రుద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని గ్రామ రెవెన్యూ అధికారులు ప్రజలకు గ్రామాల్లో అందుబాటులో ఉండాలని తహసీల్దారు మల్లికార్జునరావు సూచించారు. సోమవారం వీఆర్వోలతో సమీక్ష నిర్వహించారు. ప్రజల నుంచి రెవెన్యూ సమస్యలపై దరఖాస్తులు స్వీకరించారన్నారు. కార్యక్రమంలో డీటీ చంద్రశేఖరయ్య , సిబ్బంది పాల్గొన్నారు.

విరాళంగా కంప్యూటర్లు

బేతంచెర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సరస్వతి శిశు మందిర్ ఉన్నత పాఠశాలకు రోటరీ క్లబ్ ఆధ్వర్యంలో రెండు కంప్యూటర్లను సోమవారం అందజేశారు. కార్యక్రమంలో రోటరీ క్లబ్ అధ్యక్షుడు వీరారెడ్డి, శశికళ దంపతులు, సత్తార్, శంకర్ రెడ్డి, మధుమోహన్ రెడ్డి, ఉపాధ్యాయులు, క్లబ్ సభ్యులు ఉన్నారు.

ఎంఈవోకు సన్మానం

రుద్రవరం, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎంఈవో వీరరాఘవయ్యను ఫిజికల్ డైరెక్టర్లు, పీఈటీలు సోమవారం సన్మానించారు. కార్యక్రమంలో రుద్రవరం ఉన్నత పాఠశాలలో హెచ్ఎం సుబ్బరాయుడు, ఫిజికల్ డైరెక్టర్లు శ్రీనివాసులు, షేక్షావలి, సత్యబాబు, రేణుక, పీఈటీలు కళావతి, సిద్దయ్య పాల్గొన్నారు.

యాగంటిలో ఘనంగా పల్లకి సేవ

బనగానపల్లె ,జనవరి 27(ఆంధ్రజ్యోతి): బనగానపల్లె మండలంలోని ప్రముఖ శైవక్షేత్రం యాగంటి ఉమామహేశ్వరస్వామి ఆలయంలో సోమవారం పల్లకి సేవ ఉత్సవం నిర్వహించారు. ఈవో చంద్రుడు, పాతపాడు సర్పంచ్ మహేశ్వరరెడ్డి, భక్తులు, పూజారులు పల్లకిలో ఉమామహేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను ఊరేగించారు.

హెల్మెట్ ధరించాలి

శిరివెళ్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : రహదారి ప్రమాద సమయాల్లో హెల్మెట్‌తో ప్రాణాపాయం నుంచి రక్షణ పొందవచ్చని ఎస్ఐ చిన్న వీరయ్య అన్నారు. రహదారి భద్రత వారోత్సవాల్లో భాగంగా హెల్మెట్ ఆవశ్యకతను తెలియజేస్తూ మండలంలోని సచివాలయ మహిళా పోలీసులతో కలిసి శిరివెళ్లలోని పోలీస్ స్టేషన్ నుంచి ప్రధాన వీధుల్లో సోమవారం బైక్ ర్యాలీ నిర్వహించారు. వాహనదారులు తప్పనిసరిగా రహదారి నియమాలను పాటిస్తూ సురక్షితంగా గమ్యస్థానాలకు చేరుకోవాలన్నారు. కార్యక్రమంలో హెడ్ కానిస్టేబుల్ నాగేంద్ర, కానిస్టేబుళ్లు నీలకంఠం, శ్రీనివాసులు, ప్రసన్న కుమార్ పాల్గొన్నారు.

ఉయ్యాలవాడ : ప్రజలకు హెల్మెట్ వాడకంపై ఎస్ఐ వెంకటేశ్వర్లు అవగాహన కల్పించారు. సోమవారం స్థానిక పోలీసుస్టేషన్ నుంచి ఇంజేడు గ్రామం వరకు హెల్మెట్ ధరించి బైకులు నడిపారు. కార్యక్రమంలో కానిస్టేబుళ్లు సుబ్బారెడ్డి, బాషాలతో పాటు మహిళా పోలీసులు ఉన్నారు.

కోవెలకుంట్ల : మహిళా వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని సీఐ హనుమంతనాయక్ అన్నారు. సోమవారం సీఐ ఆధ్వర్యంలో సచివాలయ మహిళా పోలీసులు సర్కిల్ పరిధిలోని ఎస్ఐలు మల్లికార్జునరెడ్డి, భూపాలుడు, రమణయ్య బైకుర్యాలీ నిర్వహించారు. హెల్మెట్ ధరించడం వల్ల ప్రమాదవశాత్తు ఏదైనా జరిగినా ప్రాణాపాయం నుండి రక్షించుకోవచ్చని సీఐ సూచించారు.



శిరివెళ్లలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ, సచివాలయం మహిళా పోలీసులు

ప్రజాదరణ నాయకుడు నారా లోకేశ్

కొలిమిగుండ్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ రాష్ట్రంలో అత్యంత ప్రజాదరణ కలిగిన నాయకుడని టీడీపీ నాయకులు కోటపాడు శివరామిరెడ్డి, చంద్రశేఖరరెడ్డి అన్నారు. నారా లోకేష్ పాదయాత్ర ప్రారంభించి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా సోమవారం కొలిమిగుండ్ల టీడీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహించారు. కేకు కట్‌చేసి సంబరాలు చేశారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు బొట్టుస్వామి, నాగార్జునరెడ్డి, గోపాల్, టైలర్ రాముడు, బ్రీడ్స్ రవి, బాషా, బ్రహ్మనాయుడు తదితరులు పాల్గొన్నారు.

డోన్ రూరల్: రాష్ట్ర ఐటీ శాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన యువగళం కార్యక్రమం పూర్తి చేసుకుని రెండు సంవత్సరాలు పూర్తయిన సందర్భంగా డోన్ టీడీపీ కార్యాలయంలో నాయకులు సంబరాలు చేసుకున్నారు. కేక్‌ను కట్ చేసి కార్యకర్తలకు మిఠాయిలు పంపిణీ చేశారు. కార్యక్రమంలో సీనియర్ నాయకులు లక్కసాగరం లక్ష్మిరెడ్డి, టీడీపీ రాష్ట్ర కార్యదర్శి వలసల రామకృష్ణ, నాయకులు ఓబులాపురం శేషిరెడ్డి, ఓంప్రకాష్, పాల్గొన్నారు.

రాష్ట్రంలో 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యం

రాష్ట్రంలో యువతకు 20 లక్షల ఉద్యోగాల కల్పనే లక్ష్యంగా రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు, ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ శ్రమిస్తున్నారని రాష్ట్ర సీడ్స్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ ధర్మవరం సుబ్బారెడ్డి అన్నారు. సోమవారం ఎంఎస్ఆర్ కార్యాలయంలో ఆయన మాట్లాడుతూ ఇటీవల రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీశాఖ మంత్రి నారా లోకేశ్ చేపట్టిన దావోస్ పర్యటన విజయవంతమైందన్నారు.



టీడీపీ కార్యాలయంలో వేడుకలు నిర్వహిస్తున్న పార్టీ శ్రేణులు

ఆంధ్రజ్యోతి ఇంటర్వ్యూ

రూ. రెండు కోట్లతో సిమెంటు రోడ్లు

- ప్రభాకర్‌రెడ్డి, పీఆర్ ఏఈ



ప్యాపిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలో రూ.రెండు కోట్లతో సిమెంటు రోడ్లు నిర్మిస్తున్నట్లు పంచాయితీరాజ్‌శాఖ ఏఈ ప్రభాకర్‌రెడ్డి తెలిపారు. డోన్ ఎమ్మెల్యే కోట్ల సూర్యప్రకాష్‌రెడ్డి చొరవతో పనులు చేపడుతున్నామన్నారు. ప్రస్తుతం పనులు దాదాపు పూర్తి అయ్యాయన్నారు. సోమవారం తన కార్యాలయంలో ఏఈ ప్రభాకర్‌రెడ్డి 'ఆంధ్రజ్యోతి'తో మాట్లాడారు.

ప్రశ్న : ఎన్ని గ్రామాల్లో సిమెంటు రోడ్లను నిర్మిస్తున్నారు?

జవాబు: మండలంలో 20 గ్రామాల్లో 22 పనులు చేపడుతున్నాం. ఇందులో రెండు గ్రామాల్లో తప్ప అన్ని చోట్ల పనులు పూర్తి అయ్యాయి. వీటిని కూడా త్వరలో పూర్తి చేస్తాం.

ప్రశ్న: పనుల నాణ్యతలో ఎటువంట చర్యలు తీసుకుంటున్నారు?

జవాబు: పనుల నాణ్యత విషయంలో రాజీ పడటం లేదు. నిబంధనల ప్రకారమే సిమెంటు, కంకర వేస్తున్నాం. క్యూరింగ్ కూడా చేయిస్తున్నాం. కాంట్రాక్టర్లకు ముందుగా నాణ్యతపై సూచనలు, సలహాలు ఇచ్చాం. పనుల దగ్గర తాను గానీ, ఇంజనీరింగ్ అసిస్టెంట్లు గానీ ఉంటున్నాం.

ప్రశ్న: మండలంలో దాదాపు 54 గ్రామాలు ఉన్నాయి కదా 20 గ్రామాల్లో సిమెంటు రోడ్లు చేపడితే మిగిలిన గ్రామాల పరిస్థితి ఏమిటి?

జవాబు: ప్రస్తుతం రోడ్లు అధ్వానంగా ఉన్న గ్రామాల్లో వేస్తున్నాం. దశల వారిగా అన్ని గ్రామాల్లో కూడా ఎమ్మెల్యే కోట్ల సూచనల మేరకు వేస్తాం.

నేడు మండల సర్వసభ్య సమావేశం

శిరివెళ్ల, జనవరి 27(ఆంధ్రజ్యోతి) : మండలపరిషత్ కార్యాలయంలో మంగళవారం మండల సాధారణ సర్వసభ్య సమావేశాన్ని నిర్వహించనున్నట్లు ఎంపీడీవో శివమల్లేశ్వరప్ప సోమవారం తెలిపారు. ఎంపీపీ నాయక్ మహమ్మద్ వసీం అధ్యక్షతన మండలంలోని ప్రధాన సమస్యలు, వాటి పరిష్కారంపై ప్రజాప్రతినిధులు, అధికారులు సమావేశంలో చర్చించనున్నట్లు వెల్లడించారు. అన్ని శాఖలపై సమీక్ష నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మండలంలోని అన్ని శాఖల అధికారులు తమ ప్రగతి నివేదికలతో తప్పనిసరిగా సమావేశానికి హాజరు కావాలని ఎంపీడీవో సూచించారు.

సంజామలలో..

సంజామల: మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సర్వసభ్య సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు ఎంపీడీవో సాల్మన్ సోమవారం తెలిపారు. సమావేశ భవనంలో ఎంపీపీ పోచా రమాదేవి అధ్యక్షతన సమావేశాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు, సర్పంచ్‌లు, కోఆప్షన్ సభ్యులు హాజరు కావాలని ఆయన కోరారు.

'సర్క్యులర్‌ను రద్దు చేయాలి'

బేతంచెర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పొదుపు విలేజ్ బుక్ కీపర్ల కాలపరిమితి సర్క్యులర్‌ను రద్దు చేయాలని సీఐటీయూ మండల అధ్యక్షులు, వీవోఏల సంఘం జిల్లా నాయకులు ఎన్‌వీ రమణ, మధుశేఖర్ ప్రభుత్వాన్ని కోరారు. సోమవారం బేతంచెర్ల మండల తహసీల్దార్ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌లో సీఐటీయూ ఆధ్వర్యంలో వెలుగు ఏపీఎం మధుగౌడుకు వీవోఏల సంఘం నాయకుడు వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టరేట్ ముందు మంగళ, బుధవారాల్లో నిర్వహిస్తున్న నిరాహార దీక్షలను జయప్రదం చేయడానికి వీవోఏలకు అనుమతి ఇవ్వాలని కోరారు. కార్యక్రమంలో ఆదిలక్ష్మి, వెంకటేశ్వర్లు, లక్ష్మీదేవి, మహాలక్ష్మి,మహేశ్వరి, లలితమ్మ పాల్గొన్నారు.

లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదానం

బేతంచెర్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని శేషారెడ్డి ప్రభుత్వ సామాజిక ఆరోగ్య కేంద్రంలో గర్భిణులు, రోగులకు లయన్స్ క్లబ్ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. పట్టణానికి చెందిన ఉన్నం సుదర్శన్ సహకారంతో అన్నదానం చేసినట్లు లయన్స్ క్లబ్ సభ్యులు తెలిపారు. కార్యక్రమంలో అధ్యక్షుడు సూరా మధుసుధాకర్‌రెడ్డి, వలీబాషా, చంద్రశేఖర్, పవన్ కుమార్, మహేష్, రాజు పాల్గొన్నారు.

ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలి

ప్యాపిలి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పండుగలు, ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ వెంకటరామిరెడ్డి అన్నారు. సోమవారం ఆయన మండలంలోని అలేబాదు గ్రామంలో పర్యటించారు. ఈ సందర్భంగా సీఐ మాట్లాడుతూ గ్రామంలో నిర్వహించే దేవరను కలిసికట్టుగా జరుపుకోవాలన్నారు. ఎటువంటి అవాంఛనీయ సంఘటనలకు పాల్పడిన చర్యలు తీసుకుంటామన్నారు. సమావేశంలో రాచెర్ల ఎస్ఐ లక్ష్మణరావు పాల్గొన్నారు.

పాడిపరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యం

చాగలమర్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): గ్రామాల్లో పాడిపరిశ్రమ అభివృద్ధే ప్రభుత్వ లక్ష్యమని పశుసంవర్ధకశాఖ ఏడీ వరప్రసాద్ అన్నారు. సోమవారం మండలంలోని నగల్లపాడు గ్రామంలో ఏర్పాటు చేసిన పశుఆరోగ్య శిబిరాలను పరిశీలించారు. గొర్రెలకు డీ వార్మింగ్ తాపించారు. పశువులకు వైద్య చికిత్స చేసి మందులు పంపిణీ చేశారు. కార్యక్రమంలో పశువైద్య సిబ్బంది, గోపాలమిత్ర సభ్యులు, రైతులు పాల్గొన్నారు.

రేపు వెల్లాల క్షేత్రంలో తలనీలాల వేలం

చాగలమర్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): మండలంలోని వెల్లాల క్షేత్రంలో వెలసిన చెన్నకేశవ, సంజీవరాయ, భీమలింగేశ్వరస్వామి ఆలయాల్లో తలనీలాలు సేకరించేందుకు ఈనెల 29న వేలం నిర్వహించనున్నట్లు ఆలయ చైర్మన్ నారాయణరెడ్డి, ఈవో రమణ సోమవారం తెలిపారు. టెంకాయలు విక్రయించేందుకు రూ.50 వేలు, కొబ్బరి చిప్పలు పోగు చేసుకొనుటకు రూ.10 వేలు, పూజా సామగ్రి అమ్ముకునేందుకు రూ.10 వేలు డిపాజిట్ చెల్లించి వేలంలో పాల్గొనాలని సూచించారు.

కుష్ఠు వ్యాధి నిర్ధారణ సర్వే వేగవంతం

చాగలమర్రి, జనవరి 27 (ఆంధ్రజ్యోతి): కుష్ఠువ్యాధి నిర్ధారణ సర్వే వేగవంతం చేయాలని వైద్యుడు ఇమ్రాన్ సూచించారు. సోమవారం ప్రభుత్వ వైద్యశాలలో ఆయన మాట్లాడుతూ ఫిబ్రవరి రెండు వరకు చేపట్టనున్న కుష్ఠువ్యాధి సర్వేను ఇంటింటికి వెళ్లి నిర్వహించాలని అన్నారు. వ్యాధి లక్షణాలపై అవగాహన కల్పించాలని సూచించారు. వ్యాధి నిర్ధారణ అయిన వారికి వైద్య చికిత్సలు అందించి మందులను పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

రసాయన ఎరువుల వాడకం తగ్గించాలి

అవుకు, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : రైతులు రసాయనిక ఎరువుల వాడాకాన్ని తగ్గించి సేంద్రియ, జీవన ఎరువులను వాడాలని నవభారత్ ఫెర్టిలైజర్స్ ఫీల్డ్ ఆఫీసర్ కృష్ణమూర్తి అన్నారు. సోమవారం శింగనపల్లె, సుంకేసుల గ్రామాల్లో రైతుల సమావేశాన్ని నిర్వహించారు. కార్యక్రమంలో రైతులు పాల్గొన్నారు.

యువతి అదృశ్యం.. కేసు నమోదు

కోవెలకుంట్ల, జనవరి 27 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని సాయినగర్ కాలనీకి చెందిన ఓ యువతి అదృశ్యం కాగా కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ మల్లికార్జునరెడ్డి తెలిపారు. సోమవారం ఆయన తెలిపిన వివరాల మేరకు సాయినగర్‌కాలనీకి చెందిన ఓ యువతి ఈ నెల 24న సాయంత్రం ఇంటి వెళ్లిపోయింది. చుట్టుపక్కల , బంధువుల వద్ద ఆచూకీ లభ్యం కాలేదు. యువతి తండ్రి పోలీసుస్టేషన్‌లో ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్లు తెలిపారు.